# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45　　సంచిక : 21　　విజయవాడ　　5-3-2013　　పేజీలు : 8　　వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం : ప్రజాస్వామిక హక్కులపై దాడి
- విదేశాలకు ప్రవాహంలా తరులుతున్న సంపద
- బందీల శిబిరాల్లో మిజోరం పౌరుల అణచివేతకు పాల్పడ్డ భారతపాలకులు
- ఆహారకొరత-పోషకాహార లోపంతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- రెంటచింతల కౌలురైతుల కిడ్నీ అమ్మకాలు-పాలకుల దోపిడీ విధానాలు
- నల్గొండజిల్లా : ఏఎమ్మార్‌ప్రాజెక్టు జలాలను పొలాలకు, చెరువులకు వెంటనే అందించాలి


# 2013-14 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్టు

## మౌనంతో దాచిన వాస్తవాలు

**ఈ ఏడాది** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్టును పార్లమెంటుకు సమర్పిస్తూ ఆర్థికమంత్రి చిదంబరం సుదీర్ఘ ఉపన్యాసమే చేశారు. దానిలో ఆయన చెప్పిన అంశాలకంటే, ఆయన చెప్పకుండా మౌనం వహించిన అంశాలే ఎక్కువ ప్రాధాన్యత కలిగి వున్నాయి.

బడ్జెట్టు అంటే ప్రభుత్వ ఆదాయ-వ్యయ పట్టిక మాత్రమే కాదు. నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను పేర్కొని, రాబోయే సంవత్సరంలో వాటి పరిష్కారానికి చేపట్టబోతున్న విధానాలనూ, వాటి పర్యవసానాలనూ వివరిస్తారని ఎవరైనా ఆశిస్తారు. అయితే ఆర్థికమంత్రి మాత్రం స్థూల ఆర్థికరంగంలో తీసుకుంటున్న చర్యలను మాత్రమే పేర్కొన్నారు తప్ప, వాటి పర్యవసానాలను గూర్చి, అవి సామాన్యుల జీవితాలపై పడవేసే ప్రభావం గురించీ మాత్రం మౌనం వహించారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు చిదంబరం ఐదుకోట్ల వంటి చిన్నమొత్తాలను వ్యయపరిచే లేదా ద్రవ్య కేటాయింపు చేయని సూక్ష్మ పథకాలతో ఉపన్యాసాన్ని నింపివేశారు.

ఉపన్యాస ప్రారంభంలోనే “సమ్మిళిత, సమీకృత అభివృద్ధికి దారితీసే అధికవృద్ధి తన లక్ష్యమ”నీ, ఇదే “మూలమంత్ర”మనీ ఆర్థికమంత్రి గొప్పగా ప్రకటించారు. కానీ తాను ప్రతిపాదించిన చర్యలు వృద్ధిరేటును కృంగదీస్తాయన్న వాస్తవాన్ని దాచిపెట్టారు.

8శాతం వృద్ధిరేటును సాధించాలంటే ఏడాదికి నాలుగు లక్షలకోట్ల రూపాయల పెట్టుబడి అవసరమౌతుందనీ, ఈ పెట్టుబడి మదుపుకు విదేశీ పెట్టుబడులు, వాణిజ్య రుణాలే శరణ్యమనీ దేశ ఆర్థిక విధానరూపకర్తల భావన. విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలంటే ద్రవ్యలోటును తగ్గించకతప్పదన్నది వాదన. ద్రవ్యలోటు పెరిగితే భారత రుణసామర్థ్యరేటు తగ్గుతుందనీ అప్పుడు విదేశీ పెట్టుబడులు రావనీ యుపిఏ ప్రభుత్వం భావన. ద్రవ్యలోటును 5.2 శాతానికి తగ్గించానని ఆర్థికమంత్రి చెప్పారు.

ద్రవ్యలోటును ఎలా తగ్గించారు? సంపన్నులపై పన్నులు పెంచి ఆదాయాన్ని పెంచుకోవటం, ఖర్చులను తగ్గించుకోవటంద్వారా ద్రవ్యలోటును తగ్గించవచ్చు. ఆర్థికమంత్రి సామాన్యులపై భారాన్ని పెంచటం, సంక్షేమ కార్యకలాపాలను తగ్గించటం అన్న పద్ధతిని పాటించారు.

గత మూడేళ్లుగా పరిశ్రమాధిపతులకు దాదాపుగా ఏడాదికి ఐదు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీని ఇస్తూవచ్చారు. ఈ రాయితీలను ఈ బడ్జెట్టులోనూ కొనసాగించారు. అంటే ఏడాదికి 5 లక్షలకోట్ల పన్ను ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతోంది. ఈ రాయితీ యివ్వకపోతే, వృద్ధికి అవసరమైన నిధులు ప్రభుత్వం వద్ద వుండేవి. విదేశాలను దేబిరించాల్సిన అవసరం వుండదు. వార్షికాదాయం కోటి రూ॥లు దాటిన సంపన్నుల ఆదాయపు పన్నుపై 10శాతం సర్‌ఛార్జీ విధించానని చెప్పారు. ఇంత ఆదాయం వున్నవారు 48వేల మంది మాత్రమే. వీరు కూడా ఈ సర్‌ఛార్జీ చెల్లించకుండా తప్పించుకునే మార్గాలెలా ఆదాయపన్ను చట్టంలో వున్నాయో ఒక వాణిజ్య పత్రిక మరునాడే వివరించింది. సంపన్నులపై పన్నులను పెంచని ఆర్థికమంత్రి సామాన్యులపై పరోక్ష పన్నుభారాన్ని పెంచారు.

విదేశాలనుండి దిగుమతి చేసుకుంటున్న బొగ్గుపై కస్టమ్సు సుంకాన్ని 2 శాతమూ, కౌంటర్ వేయిలింగ్ సుంకాన్ని 2 శాతమూ పెంచారు. దీనివల్ల దిగుమతి బొగ్గుతో విద్యుదుత్పత్తి చేస్తున్న ప్లాంటుల విద్యుత్తు యూనిటుకు 6 పైసలు పెరుగుతుంది. ఇదికాక రైల్వే బడ్జెట్టులో బొగ్గు రవాణా ఛార్జీలను 5.8శాతం పెంచారు. ఇది యూనిటుకు 18 పైసలు అవుతుంది. ఇదంతా సామాన్య వినియోగదారులపై పడే భారమే. ఈ ఏడాది నుండీ టీవీలకు వాడి తీరాలని ఆదేశించిన సెట్ టాప్‌బాక్స్‌లపై దిగుమతి సుంకాన్ని రెట్టింపు చేశారు. ఇవన్నీ విదేశాలనుండి దిగుమతి అయ్యేవే. సామాన్యుడికి అందుబాటులో వున్న వినోదాన్నికూడా పన్ను పిండుకునేందుకు వనరు చేశారు.

ఇక ఖర్చు తగ్గింపులో కూడా ఆర్థికమంత్రి ఇదే పద్ధతి పాటించారు. ఆయన కత్తివేటు ప్రణాళికా వ్యయంపైనే పడింది. 2012-13 బడ్జెట్టులో ప్రణాళికా వ్యయానికి చేసిన కేటాయింపుల్లో కోత విధించారు. ఆవిధంగా చేసిన కేటాయంపుల్లో వాస్తవంగా ఖర్చుచేసింది 20శాతం తక్కువగా వుంది. గత బడ్జెట్టులో ప్రణాళికా వ్యయానికి రూ5.21 లక్షల కోట్లు కేటాయించగా, ఖర్చుచేసింది రూ 4.30 లక్షల కోట్లు. కాగా ఈ ఏడాది బడ్జెట్టులో రూ॥5.5 లక్షల కోట్లు కేటాయించి 30 శాతం పెంచినట్లు చెప్పుకున్నారు. దాదాపు గత ఏడాది స్థాయిలోనే కేటాయింపులు చేశారు. ఖర్చు మాత్రం గతంలాగే కోతపెట్టి తగ్గిస్తారు.

### జీవనోపాధికి దెబ్బ

ప్రణాళికా వ్యయంలో ఈ కోత ప్రజల జీవనోపాధినీ, సంక్షేమాన్నీ దెబ్బతీసేదిగా వుంది. నేటికీ దేశ జనాభాలో 70శాతం మందికి జీవనోపాధిగా వున్నది వ్యవసాయరంగమే. సాగునీరు, వరదల నివారణకు గత బడ్జెట్టులో కేటాయించిన మొత్తంలో మూడవవంతు మాత్రమే ఖర్చుచేశారు. ఈ బడ్జెట్టులో ఈ రంగానికి కేటాయింపులెంతో చెప్పకుండా ఆర్థికమంత్రి దాటవేశారు. కాగా వ్యవసాయానికి ఈ బడ్జెట్టులో రూ॥27 వేలకోట్లు కేటాయించి, 22శాతం పెంచానని ఆర్థికమంత్రి ఘనంగా చెప్పుకున్నారు. గత ఏడాది కేటాయింపే ఇది. కేటాయింపుకంటే తక్కువ చేసిన ఖర్చుతో పోల్చి 22శాతం పెంచినట్లుగా చెప్పారు. అలాగే వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని (రూ5,75,000 కోట్లు) గత ఏడాది సాధించామనీ, ఈ ఏడాది లక్ష్యాన్ని రూ॥7 లక్షల కోట్లకు పెంచుతున్నాననీ చెప్పారు. రైతాంగపు రుణ అవసరాలలో ఇది 20 శాతం కూడా లేదు. వాస్తవానికి వ్యవసాయ రుణాలలో రైతాంగానికందుతున్న రుణం తగ్గిపోతున్నది. రైతాంగం పేరిట బడావాణిజ్య వర్గాలు తమ వ్యవసాయ కార్యకలాపాలు విస్తరించేందుకు ద్రవ్య సహాయమందించేవిగా వ్యవసాయ రుణాలను వాడుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 80శాతం చిన్న, సన్నకారు రైతులు. వ్యవసాయ రుణాలలో సగం పంట రుణాలుగా వీరికందించాలి. సాగుయంత్రాలకూ, శీతల గిడ్డంగులకు తదితరాలకు ఇచ్చిన రుణాలలో కొంత భాగాన్ని పంట రుణంగా చూపవచ్చునని ప్రభుత్వం బ్యాంకులకు అనుమతినివ్వటంతో పంట రుణాలు రైతాంగానికి అందకుండా పోతున్నాయి. ఈసారి ఆర్థికమంత్రి ప్రైవేటు బ్యాంకులద్వారా వ్యవసాయ రుణాల వితరణను పెంచుతానని చెప్పటంద్వారా బడావాణిజ్య వర్గాలకే ఇది చేరుతుందని చెప్పకనే చెప్పారు.

**(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

# దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లను ఖండించండి

## ముస్లిం ప్రజలపై ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసించండి

**ఫిబ్రవరి** 21 సాయంత్రం దిల్‌సుఖ్‌నగర్‌లోని జనసమ్మర్ధ ప్రాంతమైన బస్సుడిపో సమీపంలో రెండు బాంబులు ప్రేలటంతో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. వందమందికిపైగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు “జనశక్తి” తన ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నది. గాయపడినవారికీ, వారి కుటుంబ సభ్యులకూ తన సానుభూతిని తెలుపుతున్నది. వారి తీర్చలేని దుఃఖంలో పాలుపంచుకుంటున్నది. ఈ దుశ్చర్యను ప్రజా వ్యతిరేకమైనదిగా తీవ్రంగా ఖండిస్తున్నది.

ఈ పేలుళ్లలో చేతికందివస్తారని ఆశించిన యువతనూ, కుటుంబ పెద్దనూ కోల్పోవటం; లేదా వారు తీవ్రగాయాలపాలవటంతో కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయాయి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా, వైద్య సహాయంతోపాటుగా, వారు కోల్పోయిన ఉపాధిని కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలు పేద, దిగువ మధ్యతరగతికి చెంది వున్నందున ఇది అత్యావశ్యకం.

బాంబుపేలుళ్లతో ఉలిక్కిపడ్డ హైద్రాబాదు నగర ప్రజలు అత్యంత ఉదాత్తంగా వెనువెంటనే స్పందించారు. అంబులెన్సులు, అధికారుల రాకకోసం ఎదురుచూడకుండా వెంటనే ఆర్టీసీ బస్సులో గాయపడిన వారిని దగ్గరనున్న ఆస్పత్రులకు చేర్చారు. ఘటన జరిగిన పావుగంటలోనే 120 మంది ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు సేవలందించేందుకు సిద్ధంగా వున్నారు. నగరంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రజలెక్కడా “ప్రతీకార” చర్యలు కాదు కదా ఆందోళనలకు కూడా పూనుకోలేదు. మత ఘర్షణలకు అసలు చోటే పెట్టలేదు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారాశించిన విధంగా ఘర్షణలకు చోటివ్వకుండా తమ సంయమనంతో బాంబు పేలుళ్లను ముక్తకంఠంతో ఖండించారు.

కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారశైలే పలు సందేహాలకు తావిచ్చేవిగా వున్నాయి. ప్రేలుళ్లు జరిగిన అరగంటకే, సాక్ష్యాధారాల సేకరణకూడా ప్రారంభంకాకుండానే కేంద్ర దేశీయమంత్రిత్వశాఖామంత్రి షిండే ఇది ముస్లిం టెర్రరిస్టు చర్య అనీ, వారిలో ఇండియన్ ముజాహిదీన్ చర్య అని ప్రకటించటం పూర్తి బాధ్యతరాహిత్యంగానే చూడలేము. ఈ ప్రకటన ద్వారా పరిశోధనా సంస్థలు ఏ దిశగా పనిచేయాలో షిండే నిర్దేశించాడనటం అతిశయోక్తికాబోదని రాష్ట్ర, కేంద్ర పోలీసు వర్గాల పనితీరు స్పష్టంచేసింది.

హైద్రాబాదులో ముస్లిం యువకుల నెత్తుకుపోవటం మళ్లీ మొదలైంది. 2007లో మక్కామసీదు బాంబుపేలుళ్లలో ఆరుగురు ముస్లిం యువకులపై నిందితులుగా కేసుపెట్టారు. బెంగుళూరు తీసుకువెళ్లి వారిపై లైడిటెక్టరు(అబద్ధాలను పసికట్టే) పరీక్షలు జరిపి నిందితులు అబద్ధాలాడుతున్నారని చెప్పారు. కానీ న్యాయస్థానం 2009లో వారిని నిర్దోషులుగా విడిచిపెట్టింది. కాగా ఈ కేసును పరిశోధించిన కేంద్ర గూఢచారి బ్యూరో ఇది హిందూ మతోన్మాద శక్తుల చర్యఅని తేల్చి, 2010లో నలుగురిపై కేసుపెట్టింది. తొలుత నిందితుల్లో ఒకడైన ముస్లిం యువకుడు రియాసుద్దీన్ అనే యునానీ వైద్యవిద్యార్థి విడుదలైన తర్వాత విద్య పూర్తిచేసి, వైద్య వృత్తిలో వున్నాడు. ఇతనినిప్పుడు పోలీసులు పట్టుకుపోయారు. మక్కా మసీదుముందు తోపుడుబండిలో తినుబండారాలమ్మే యువకుడు ఆనాడు తీవ్రంగా గాయపడి, కోలుకుని తిరిగి దిల్‌సుఖ్‌నగర్ వద్ద వ్యాపారం సాగించుకుంటూ మళ్లీ గాయపడ్డాడు. ఇతనిని పోలీసులు అనుమానితుడన్నారు. ప్రజలనుండి తీవ్ర నిరసనలు వ్యక్తంకావటంతో వెనక్కుతగ్గారు. వారం తర్వాత రియాసుద్దీన్‌ను మళ్లీ పట్టుకుపోయారు.

మక్కా మసీదుతోపాటు మాలేగావ్‌లోనూ, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లోనూ పేలుళ్లకు హిందూ మతోన్మాద శక్తులే కారణమని తేలింది. గోకుల్‌ఛాట్ పేలుళ్లు కూడా వారిపనేనన్న వాదనలూ బలంగానే వున్నాయి. అయినా హిందూ మతోన్మాదశక్తుల పాత్రవుందా అన్న ఆలోచనకూడా రానీయకుండా ముస్లిం టెర్రరిస్టులే కారణమని తేల్చేస్తున్నారు. పేలుడు స్థలాన్ని చూసేందుకు నాయకులు క్యూకట్టినందున కీలక సాక్ష్యాధారాల సేకరణ దుర్లభమైందంటూ, మరోవైపున ముస్లింలపై నిందమోపటం ఆధారరహితంగానే పక్షపాత ప్రచారం సాగిస్తున్నారని తెలుపుతున్నది.

దాడులు జరుగుతాయని ముందుగా సమాచారమిచ్చామని స్వయంగా షిండేనే చెప్పి వివాదాన్ని రేపటమూ, నేరపరిశోధన రాష్ట్ర పోలీసులు చేయాలా, జాతీయ పరిశోధకసంస్థ(ఎన్ఐఏ) చేయాలా అన్న చర్చ ప్రజల దృష్టిని మళ్లించేదే. ఆర్నెల్లుగా జైలులోవున్న మక్బుల్ అంతకుముందు రెక్కి నిర్వహించాడంటూ తీసుకువచ్చి, అతనిచ్చిన సమాచారం ఆధారమంటూ మళ్లీ ముస్లిం యువకులను పట్టుకుపోవటం, ఈ పేలుళ్లకు పాకిస్తానులోని టెర్రరిస్టుల నుండి నిధులందాయంటూ ఎలాంటి నిర్దిష్ట ఆధారాలు చూపకుండా ప్రచారం సాగించటమంటే తాము

**(తరువాయి 3వ పేజీలో)**

## మార్చి 8 - అంతర్జాతీయ శ్రామిక మహిళాదినోత్సవం వర్ధిల్లాలి

**బడ్జెట్టు...** (మొదటి పేజీ తరువాయి)

ఇక పారిశ్రామిక వృద్ధికుంటినడక నేపథ్యంలో ఉపాధి కల్పన ఎండమావే. నైపుణ్య పెంపుదలకు పథకాల గురించి మాట్లాడిన ఆర్ధికమంత్రి వాటికి కేటాయింపులను మాత్రం అస్పష్టంగా పేర్కొన్నారు. పైగా ఉపాధి కల్పన గురించి ఒక్కమాటకూడా లేదు. ప్రజలకు ఉపాధి కల్పనను పాలకులు తమ ఎజండానుండి తప్పించారు.

## సంక్షేమానికి కోత

ప్రణాళికా వ్యయంలో కోత సంక్షేమ రంగాన్ని తాకింది. విద్య, వైద్య రంగాలలో ప్రణాళికా వ్యయాన్ని భారీగా తగ్గించారు. విద్యారంగానికి కేటాయింపులు రూ॥65,867 కోట్లు. గత బడ్జెట్టులో తగ్గించిన వాస్తవ ఖర్చుతో పోల్చి 17శాతం పెంపుదలగా చెప్పుకున్నారు తప్ప కేటాయింపులు పెరిగింది లేదు. ఏడాది ముగిసేసరికి వాస్తవ ఖర్చు తగ్గుతుంది. సర్వశిక్షాఅభయాన్‌కు రూ॥27,258 కోట్లు కేటాయించినట్లు చెప్పటమే మోసపూరితం. సేవా పన్నుపై సర్‌ఛార్జీగా సర్వశిక్షా అభయాన్‌కు డబ్బులు వసూలు చేస్తున్నారు. అలా వసూలు చేసినవాటినుండి కొంత మాత్రమే దీనికి కేటాయిస్తున్నారనీ, వసూలైన మొత్తాన్ని దీనికోసమే వినియోగించటంలేదని పై కేటాయింపు తెలుపుతోంది.

అలాగే వైద్యరంగానికి కూడా కేటాయింపులు తగ్గిస్తున్నారు. వైద్యరంగానికి ఈ ఏడాది రూ॥37,330 కోట్లు కేటాయించారు. దీనిలో రూ॥21,239 కోట్లు జాతీయ ఆరోగ్య కార్యక్రమానికి కేటాయించగా, ప్రభుత్వ ఆస్పత్రులకు మిగిలేది రూ॥16వేల కోట్లు. విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరంచేసి ప్రజల కన్నుగప్పటానికి అక్షరాలు నేర్పే కార్యక్రమాలను ప్రారంభించినట్లుగానే, ఆ పేరుచెప్పి పన్నులు విధించినట్లుగానే, వైద్య రంగంలోనూ చేస్తున్నారు. వైద్యరంగంలో ప్రైవేటు మార్కెట్టు శక్తులకు పట్టంగట్టి జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. ఆచరణలో దీన్ని తాత్కాలిక వైద్య శిబిరాలు నిర్వహించే కార్యక్రమంగా దిగజార్చారు. ఈ క్రమంలో దీనిని అధికార, రాజకీయ గణాలకు నిధులను మెక్కే సాధనం చేశారు. 50శాతం పైగా నిధులు అక్రమార్జనల పాలయ్యాయని ప్రణాళికాసంఘ నివేదికలే తెలిపినా, దిద్దుబాటు చర్యలేమిటో తెలుపకుండా, ఈ విధంగానే పట్టణ ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించి రెంటినీ కలిపి జాతీయ ఆరోగ్య కార్యక్రమంగా అమలు చేస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. కొన్నాళ్ల తర్వాత విద్యా సర్‌ఛార్జీలాగే, వైద్య సర్‌ఛార్జీకూడా విధించి, ఈ కార్యక్రమాన్ని నడుపుతామన్నా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

ప్రజలకు కొంత ఉపశమనాన్నిచ్చే చర్యలను కూడా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలుగా చెప్పుకుంటున్నది. కేంద్రం నిధులు అందించే పథకాలు 173 వున్నాయి. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్సుమెంటు మొదలగు పథకాలివి. వీటిని కలిపివేసి 70కి తగ్గిస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. వీటిలో ఏ పథకాలు రద్దవుతాయో చెప్పలేదు. ఇన్నాళ్లూ ఈ పథకాలను కేంద్రం రూపొందించేది. నిధులందించేది. రాష్ట్రాలు కొంత మాచింగ్‌గ్రాంటుతో అమలుచేసేవి. ఇక ఈ నిధులను పథకాలకు ఇచ్చినా, రాష్ట్రాల ప్రణాళికా వ్యయానికి కేంద్రమిచ్చిన సహాయం పద్దులో చూపుతారు. అంటే రాష్ట్ర ప్రణాళికలకు కేంద్రమిస్తున్న నిధులు పెరుగుతునట్లు కన్పిస్తాయి. అలాగే కేంద్ర ప్రణాళికా వ్యయం పెరిగినట్లు కన్పిస్తుంది. కానీ వాస్తవానికి అవి ఉపశమన పథకాలకు ఖర్చు అవుతాయి. ఇది ప్రణాళిక అన్న అవగాహనకే తూట్లు పొడుస్తుంది. తత్పర్యవసానంగా రాష్ట్రాల ప్రణాళికా వ్యయం తగ్గిపోయి, ఈ ప్రజాకర్షక పథకాలకు మళ్లించటం పెరుగుతుంది. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా నిర్మాణాలకు వెచ్చించవలసిన నిధులు తాత్కాలిక ప్రయోజనాలకొరకు దుర్వినియోగమై ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తాయి. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రభుత్వ కాంటీన్లు తెరిచి ఇడ్లీ రూపాయికి అమ్మే పథకాన్ని నిరుడు ప్రకటించింది. ఇప్పటికి చెన్నైలో 39 కాంటీన్లు తెరిచింది. బడ్జెట్టు వెలువడిన రెండవరోజునే చెన్నై నగరం అన్ని వార్డులలో 200 కాంటీన్లు వెంటనే తెరుస్తామనీ, ఏడాది చివరికి అన్ని జిల్లాలకు విస్తరింపచేస్తామనీ ప్రకటించింది. ప్రణాళికా నిధులకు గమ్యం లేకుండా పోతుందనటానికి ఇది సూచిక మాత్రమే.

## ప్రజలపై ధరల భారం

ద్రవ్యలోటు తగ్గించటానికి ఆర్థికమంత్రి తీసుకున్న మరో చర్య సబ్సిడీలలో కోత. కేంద్రప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలో 90శాతం ఆహార, పెట్రో సబ్సిడీలున్నాయి. వాస్తవానికి ఇవి ప్రజలకిస్తున్న సబ్సిడీ కాదు. ఫుడ్‌కార్పొరేషన్‌కిస్తున్న, ఎరువుల కంపెనీలకిస్తున్న సబ్సిడీని ప్రజలకిస్తున్న ఆహార సబ్సిడీగా పేర్కొంటున్నారు. అలాగే అంతర్జాతీయ ధరలతో పోల్చి పోగొట్టుకొన్నామంటున్న ఆదాయాన్నే పెట్రో సబ్సిడీగా చెబుతున్నారని 'జనశక్తి' గత సంచికలో వివరించాము.

ఈ బడ్జెట్టులో ఆర్థికమంత్రి ఆహారసబ్సిడీని రూ॥90వేల కోట్లుగా చూపించారు. దీనిలోనే ఆహార భద్రతా చట్టం క్రింద రూ॥10వేల కోట్లు కేటాయింపు వుంది. ఇదికాక ఎరువుల కంపెనీలకు గత ఏడాది బాకీపడిన రూ॥14వేల కోట్లు దీనిలోనే వున్నాయి. అంటే మిగిలేది దాదాపుగా రూ॥65వేల కోట్లు మాత్రమే. అంటే ఎరువుల ధరలు రెట్టింపు పెరిగిపోతాయి. చౌకధరల దుకాణాలద్వారా ఆహార ధాన్యాల ధరలు పెంచరుగానీ సరఫరా తగ్గించి వేయటంద్వారా ప్రజలకు ఎక్కువ ధరపెట్టి కొనుక్కునే స్థితి కల్పిస్తారు. గత బడ్జెట్టులో రూ॥97వేల కోట్లున్న చమురు సబ్సిడీ, రూ॥65వేల కోట్లకు తగ్గుతుందని ఆర్థికమంత్రి చెప్పారు. అంటే 32వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. డీజిలు, కిరోసిన్, వంటగ్యాసు ధరలు మరింతగా పెరుగుతాయి. పెట్రోలు ధరల నియంత్రణ మానివేశారు. ధనికుల కార్లకు తక్కువ ధరకు డీజిలు ఇవ్వరాదంటూ వాదించి సామాన్యులుపయోగించే ప్రజారవాణా వ్యవస్థలైన రైల్వేలు, ఆర్టీసీలకు డీజిలు రేట్లు పెంచారు. బొగ్గుపై సుంకం పెరగటంతో విద్యుత్తు ఛార్జీలు పెరిగి, డీజిలు రేట్లు పెరిగి రైల్వేలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఛార్జీలు పెంచుతాయనీ ప్రకటించారు. పెరిగిన డీజిలు ఛార్జీలతో ఆర్టీసీలు కూడా ఛార్జీలు తరచుగా పెంచుకుంటూపోతాయి. దీనితో రవాణా ఛార్జీలు పెరిగి అన్ని నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని దాటుతాయి. ఈ భారమంతా సామాన్యుడి పైనే పడుతుంది.

## దారిద్ర్య నిర్మూలన నినాదప్రాయం

గత ఐదేళ్లుగా యుపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని దారిద్ర్య నిర్మూలనకు తలమానికంగా చెప్పుకుంది. 2009 ఎన్నికలకు 40వేల కోట్లతో ప్రారంభించిన ఈ పథకాన్ని ఏనాడూ చెప్పుకున్న స్థాయిలో అమలు జరపలేదు. గత ఏడాది దీనికోసం రూ॥33వేల కోట్లు కేటాయించి, రూ॥29వేల కోట్లు వెచ్చించారు. ఈ ఏడాది మళ్లీ అదే రూ॥ 33వేల కోట్లు కేటాయించి దానినే కేటాయింపు పెంపకంగా ఆర్థికమంత్రి చెప్పుకున్నారు. మళ్లీ ఎన్నికలు రావటంతో మరో కొత్త పథకాన్ని ముందుకు తెచ్చారు. అదే నగదు బదిలీ పథకం. ప్రయోగాత్మకంగా దీనిని కొన్ని జిల్లాల్లో అమలు జరిపారు. దీనికోసం గత బడ్జెట్టులో రూ॥5595 కోట్లు కేటాయించారు. కాగా ఖర్చుచేసింది రూ॥5 కోట్ల 38 లక్షలు మాత్రమే. రాజస్తాన్‌లో కిరోసిన్‌కు అమలుచేసిన నగదు బదిలీపథకంతో 87 శాతం కిరోసిను అమ్మకాలు తగ్గిపోయాయి. సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు ఈ పథకాన్ని చేపట్టారు. (చూడండి జనశక్తి 20-2-2013).

ఈ పథకాన్ని ప్రజాకర్షక పథకంగా అమలుచేసే చర్యలు ఆర్థికమంత్రి ఈ బడ్జెట్టులో ప్రారంభించారు. గర్భిణీలకూ, తల్లులకు నగదు బదిలీక్రింద కేటాయింపులను గత బడ్జెట్టుకంటే ఐదురెట్లు పెంచారు. అలాగే ఎస్‌టి,ఎస్‌సి, బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు కేటాయింపులను మూడురెట్లు పెంచారు. అలాగే వెనుకబడిన కులాల ఉన్నత విద్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు 44 శాతం పెంచారు. ఇవన్నీ నగదు బదిలీక్రింద వస్తాయి. అలాగే ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు కూడా నిధులు పెంచినట్లు చెప్పారు. కానీ వాస్తవంలో పెంచింది లేదు.

ఎస్‌టి సబ్‌ప్లానుకు రూ॥24వేల కోట్లూ, ఎస్‌సి సబ్‌ప్లానుకు రూ॥41 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇది నిరుటి బడ్జెట్టు కేటాయింపు కంటే 12.5 శాతం, సవరించిన ఖర్చుకంటే 31శాతం అధికమని కూడా చెప్పారు. దీని అర్థం గత ఏడాది కేటాయింపులో 15 శాతం నిధులు ఖర్చు చెయ్యలేదు. నగదు బదిలీ పథకం కేటాయింపులను దీనితో చేర్చి పెంచినట్లు చూపారు. అలాగే మహిళలకు కూడా రూ॥97వేలకోట్లు కేటాయించినట్లు చెప్పుకున్నారు. దీనినే జండర్ బడ్జెట్టు అని చెప్పుకున్నారు. ఇక్కడ కూడా నగదు బదిలీ పథకాన్నే దీనిలో చేర్చారు. ఒంటరి మహిళలు, వైధవ్యం పొందినవారి సంక్షేమానికి పథకాన్ని రూపొందించమని ఆదేశించానంటూ ఇప్పటికింకా లేని పథకానికి రూ॥200 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రక్కనపెట్టి నగదు బదిలీపథకాన్ని ముందుకు తెచ్చారు. సబ్సిడీలు తగ్గించి, ధరలు పెంచివేసి ప్రజలపై మోయలేని భారాలుమోపి, దానిని కప్పిపుచ్చుకునేందుకు నగదు బదిలీతో ప్రజలకు సంక్షేమం చేకూర్చుతున్నట్లు చూపటానికి పూనుకున్నారు. ఆవిధంగా ఓట్లు పొంది తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెసు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెసు ఎన్నికల ప్రచారవ్యూహాని కనుగుణంగానే ఆర్థికమంత్రి బడ్జెట్టును రూపొందించారు.

రెట్టింపు సమీకృత, సమ్మిళిత అభివృద్ధి మూలసూత్రమన్న ఆర్థికమంత్రి, బడ్జెట్టులో చేపట్టిన చర్యలేవీ ఏ ఆర్థికరంగంలోనూ వృద్ధిని పెంచేవిగా లేవు. ద్రవ్య లోటును తగ్గిస్తే విదేశాలనుండి పెట్టుబడులు తరలి వస్తాయన్న ఆశతో తీసుకున్న చర్యలు తప్ప వ్యవసాయ రంగంలోకానీ, పారిశ్రామికరంగంలోగానీ పెట్టుబడుల మదుపును పెంచే చర్యలేవీ తీసుకోలేదు. రైతులు శ్రమించి వ్యవసాయాన్ని పెంచినందుకు ధన్యవాదాలు తెలిపిన ఆర్థికమంత్రి వారికి మద్దతుగా ఏ చర్యలూ తీసుకోకపోగా, రైతాంగాన్ని సాగునుండి తప్పించి, బడా వాణిజ్య వర్గాలకు చోటుపెట్టేందుకు సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు రూపొందించిన గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధికి రూ॥20వేల కోట్లు కేటాయించారు.

గత ఏడాది వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనల్లో 70శాతం పైగా దేశంలోని పరిశ్రమలను కొనుగోలుచేసేవిగానే వున్నాయి. కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు తక్కువ. కాగా ఈ బడ్జెట్టులో ఆర్థికమంత్రి విదేశీ ద్రవ్య పెట్టుబడులకు మదుపు అలవెన్సును 15 శాతం (ఇది అరుగుదలకు అదనంగా) ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదికాక రాజీవ్‌గాంధీ ఈక్విటీ సేవింగ్స్ స్కీమ్ క్రింద షేరు మార్కెట్లో జూదమాడేందుకు అనుమతించారు. పరిశ్రమల స్థాపన జరిగి, ఉపాధి పెరుగుతుందనేది ఆవిధంగా వృద్ధిరేటు పెరుగుతుందనేది అత్యాశే.

ద్రవ్య రంగంలో కూడా విదేశాలకు పెద్దపీట వేసే దిశగానే సాగుతున్నారు. ఇన్సూరెన్సు రంగాన్ని ప్రైవేటీకరణ పేరిట విదేశీ కంపెనీలకు అప్పగించారు. ప్రభుత్వరంగ బ్యాంకులలో నిరర్ధక ఆస్థులు పెరుగుతున్నాయంటూ ప్రైవేటు బ్యాంకులకు అనుమతినివ్వాలన్న వాదనను ముందుకు తెస్తున్నారు. బ్యాంకు ఇచ్చిన అప్పులను తిరిగి వసూలు చేసుకోలేకపోతే (ఎగ్గొట్టిన వారందరూ బడా బూర్జువాలే) వసూలు చేసుకునేందుకు చర్యలను పటిష్ఠం చేయాల్సిందిపోయి, ప్రైవేటు బ్యాంకులను అనుమతిస్తామనటం 'తుంటి జబ్బుకు పన్నొదగొట్టే' చందంగా వుంది. రిజర్వుబ్యాంకు డిప్యూటీ గవర్నరుకు ప్రైవేటు బ్యాంకులకు లైసెన్సు నిచ్చేందుకు విధి విధానాలు రూపొందించే పని అప్పజెప్పారు.

ఆర్థికమంత్రి మూడు వాగ్దానాలు చేశారు. ఒకటి మహిళలకు, రెండు యువతకు, మూడు పేదలకు. మహిళల ఆర్థిక పురోగతికి చర్యలు తీసుకుంటానంటూ రూ॥1000 కోట్లతో మొట్టమొదటి మహిళాబ్యాంకును ఏర్పాటు చేస్తానని చెప్పారు. వెయ్యికోట్ల మూలధనంతో ఒక బ్యాంకు పనిచెయ్యగలగటం అసాధ్యం. మహిళా పెట్టుబడి దారులకూ, వ్యాపారులకూ, స్వయం సహాయక బృందాలకూ ద్రవ్యసహాయమందించే ఈ బ్యాంకును మహిళలే నడుపుతారని చెప్పారు. అక్టోబరు నెలనాటికి దీనికి లైసెన్సు జారీచేస్తామనీ చెప్పారు. ఇది ప్రదర్శనాత్మక చర్యగానే వుంటుంది.

మహిళల రక్షణకు, భద్రతకు కట్టుబడిన ప్రభుత్వం నిర్భయ నిధిని ఏర్పాటు చేస్తుందనీ, దానికి ప్రభుత్వం వెయ్యికోట్లు సమకూరుస్తుందనీ ప్రకటించారు. కానీ ఆ నిధికి సంబంధించి కనీస ప్రాథమిక అంశాలుకూడా రూపొందించలేదు. ఇప్పుడు మహిళా శిశుశాఖ వాటిని రూపొందించే పని చేపడుతుందట. అవి రూపొందేసరికి ఏరూపం తీసుకుంటాయో, అవి ఏమేరకు మహిళలకు భద్రత కల్పించగలిగేవిగా వుంటాయో వేచిచూడవచ్చుగానీ, ప్రస్తుతానికిది మరో ప్రచారాస్త్రంగా వాడారు.

యువతకు చేసిన వాగ్దానం నైపుణ్యం పెంపుదల పథకం. దీనిక్రింద 10 లక్షల మంది యువకులను ఎంపికచేసి నైపుణ్యం నేర్పేశిక్షణ నిస్తారు. శిక్షణ పూర్తయినతర్వాత పరీక్షపెట్టి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేటూ, 10వేల రూపాయలు ఇస్తారు. మరి ఉద్యోగమిచ్చేదెవరు? దీనికి ఆర్థికమంత్రిగారి మౌనమే సమాధానం. శిక్షణ నివ్వాల్సిన నైపుణ్యాలేమిటో దానికి సిలబసు ఏదో ఇంకా రూపొందలేదు. ఇప్పుడు రూపొందిస్తారట. ఎవరైనా శిక్షణ ఇవ్వవచ్చునట. ఎక్కడ శిక్షణ పొందినా ప్రభుత్వం పరీక్షపెట్టి సర్టిఫికేట్ ఇస్తుంది. యువకులు ఫీజులు కట్టి శిక్షణ పొందాలి. ఇంకా రూపురేఖలు లేని ఈ పథకానికి వెయ్యికోట్లు కేటాయించారు. ఇది మరో ఎన్నికల వాగ్దానంగానే మిగులుతుంది.

పేదలకు చేసిన వాగ్దానం నగదు బదిలీపథకం. ఇప్పటికే అమలు ప్రారంభించి 11 లక్షలమంది లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు చిందించానని చెప్పి ఆధార్ కార్డులిచ్చే పనిని త్వరితం చేసేందుకు మరో వెయ్యికోట్లు కేటాయిస్తున్నానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ కాలవ్యవధి అంటే ఏడాదిలోపు ఈ పథకాన్ని దేశమంతటా అమలుచేస్తానని వాగ్దానం చేశాడుగానీ దానికయ్యే ఖర్చులుగానీ, కేటాయింపులుగానీ చెప్పలేదు. దారిద్ర్య నిర్మూలన పేరిట గత 60 ఏళ్లుగా వచ్చిన పథకాల పరంపరలో నగదుబదిలీ పథకం యిప్పుడు వచ్చింది. ఎన్నాళ్లుంటుందో తర్వాత ఏ పేరు మారుతుందో వేచిచూడాలి. కానీ ఇది దారిద్ర్యాన్ని నిర్మూలించే లక్ష్యం అంచులకు కూడా చేరబోదని చెప్పడానికి వేచిచూడనక్కరలేదు.

"కళ్లతో చూసి సరైనదని నమ్మినదానిని ఊగిసలాట లేకుండా కృతనిశ్చయంతో అమలుజరపు"

అన్న తిరువళ్లువార్ సూక్తితో చిదంబరం తన బడ్జెట్టు ఉపన్యాసాన్ని ముగించారు. తన ప్రభుత్వం ఈ సూక్తి కనుగుణంగా వ్యవహరిస్తున్నదని చెప్పుకున్నారు. నిజమే దేశ, విదేశీ దోపిడీవర్గాలకు సేవచేయటం, భారత ప్రజలపై భారాలు మోపటమే "సరైనద"ని ఆయన భావిస్తున్నారు. అందులో ఆయనకు తప్పేమీ కన్పించటం లేదు.

అందుకనే తానెంతో గౌరవించే కవి అని చెప్పిన తిరువళ్లువార్ మరో సూక్తి ఆయనకు గుర్తు రాలేదు.

"చేసిన తప్పునే మళ్లీ చెయ్యకు. మొదటిసారి
తెలియకచేసినా, మళ్లీ తప్పుచెయ్యకు"

బడ్జెట్టు ప్రసంగంలో తెలిసి తెలిసి అదే తప్పును చిదంబరం మళ్లీ చేశారు.

✡


## జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ, 520 010 |
| 2. | ప్రచురణ కాలం | : | పక్షానికొకసారి (పక్ష పత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు | : | పి.జస్వంతరావు |
| | జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్,<br>మొగల్రాజపురం, విజయవాడ-520 010 |
| 4. | ప్రచురణ కర్త పేరు,<br>జాతీయత, చిరునామా | : | పై విధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | పి.జస్వంతరావు |
| 6. | భాగస్వాములు | : | - |

పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థములు

5.3.2013

సం॥ పి.జస్వంతరావు

# జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం ప్రజాస్వామిక హక్కులపై దాడి

**జాతీయ** టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్యనిర్వాహక ఆజ్ఞను జారీచేసింది. "బయటినుండి ఎగుమతి చేయబడుతున్న", "ఆంతరంగికంగా తలయెత్తుతున్న" టెర్రరిస్టు కార్యకలాపాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు దేశమంతటా వున్న గూఢచారి సంస్థల మధ్య సమన్వయాన్ని ఏర్పాటుచెయ్యటం ఈ కేంద్రపు లక్ష్యంగా ప్రకటించారు. శాంతి-భద్రతల పరిరక్షణ రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో వున్నందున, ఈ కేంద్రం ఏర్పాటు రాజ్యాంగచట్టం రాష్ట్రాలకు కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే చర్యగా భావించి 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు దీనిని వ్యతిరేకించారు. జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం, భారత గూఢచారి సంస్థ ఇంటెలిజెన్సు బ్యూరోలో భాగంగా 2012 మార్చి 1 నుండి పనిచేయటం ప్రారంభించాలి. రాష్ట్రాలలో మరింతగా చర్చించేందుకు వాయిదా వేశారు. వచ్చే నెలలో రాష్ట్రముఖ్యమంత్రుల సమావేశాన్ని జరపనున్నట్టు చిదంబరం ప్రకటించారు.

ఈ కేంద్రం ఏర్పాటు గురించి చర్చ సాగుతున్నది. రాజ్యాంగ చట్టంలోని 245 నుండి 261 అధికరణాలలో వున్న విధంగా శాంతి-భద్రతలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలో వున్నాయా లేక 355వ అధికరణం ప్రకారం శాంతి-భద్రతలను కాపాడే బాధ్యతను కేంద్రంతో పంచుకోవాలా అన్న అంశంపై ఎడతెగని చర్చలు సాగుతున్నాయి. భారత దేశంలో ప్రజాస్వామికమని పిలువబడుతున్న వ్యవస్థలోని సంస్థాగత బలహీనతలను ఈ చర్చ ఎత్తిచూపింది. అయితే దోపిడీ పాలకవర్గాల నియంతృత్వం దీని స్వభావంగా వున్నదన్న వాస్తవాన్ని చర్చల్లోకి తీసుకురావటంలో విఫలమైంది. భారత ప్రజలను అణచివేసే పనిలో కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్రప్రభుత్వాలూ సమన్వయంతో సహకరించుకుంటున్నాయన్న వాస్తవాన్ని కప్పిపుచ్చింది.

భారత రిపబ్లిక్, సమాఖ్య స్వభావం కలిగివుందనీ, కేంద్రం, రాష్ట్రాలూ, స్థానిక సంస్థలూగల మూడంచెల మధ్య అధికార వికేంద్రీకరణ వున్నదని భారత పాలకవర్గాలు చెప్పుకుంటున్నాయి. కానీ ఏకాధికారంగానే వుంది.

భారత రిపబ్లిక్కుగా ఏర్పడిన గత 63 సంవత్సరాలుగా కేంద్రప్రభుత్వం అన్నిరంగాలలోనూ అధికారాలను తన చేతులలో కేంద్రీకరించుకునే చర్యలనే తీసుకుంటూ వస్తున్నది. అనేక సందర్భాలలో యిది పాలక వర్గాలలో ముఠాల మధ్యన తగవులకూ, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై తీవ్ర చర్చలకు దారితీసింది. దేశంలో సర్వవ్యాపిత సంక్షోభం తీవ్రమైన కొలదీ అధికారాల కేంద్రీకరణ కూడా పెరుగుతూ వచ్చింది. ప్రజలను అణచివేసేందుకు నిరంకుశాధికారాల కేంద్రీకరణను సాగించిన రంగాలలో శాంతి-భద్రతలు ఒకటి.

శాంతి-భద్రతలు రాష్ట్రాల అధికార పరిధిలోనిదని స్పష్టంగా వున్నప్పటికీ, ("రాజ్యాంగ పరిధులను దాటిపోయే ప్రమాదానికి అత్యంత సమీపంగా తన చర్య వుంద"న్న చిదంబరం మాటల ప్రకారం కూడా) రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతోనే కేంద్రం తన పోలీసు అధికారాలను విస్తరించుకుంటూ వస్తున్నది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం(యుఏపిఏ), టెర్రరిస్టు నిరోధక చట్టం (పోటా)వంటి నిరంకుశాధికారాలుగల నిర్బంధ చట్టాలను చేసింది. టెర్రరిజంపై పోరాడటమన్న సాకుతో తన ఆధీనంలోని అర్ధ సైనిక బలగాలకు పోలీసు అధికారాలను కట్టబెడుతున్నది. అరెస్టుచేసి కేసుపెట్టే పోలీసు అధికారాలను ఇప్పటికే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి (సిఐఎస్ఎఫ్) ఇచ్చింది. కేంద్ర రిజర్వు పోలీసు దళానికీ(సిఆర్పిఎఫ్), రైల్వే రక్షక దళానికీ(ఆర్పిఎఫ్) పోలీసు అధికారాలను కట్టబెట్టే రెండు బిల్లులు పార్లమెంటు ముందున్నాయి. సముద్రతలంనుండి చొరబాట్లనూ, దాడులనూ నివారించటమన్న సాకుతో తీరప్రాంత పోలీసు స్టేషన్లను పెడుతున్నది. ఈ మెరైన్ పోలీసు స్టేషన్లను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలనీ నిధుల కొరతను కారణంగా చూపుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం తీర్మానం చేసింది. జాతీయ పరిశోధనా సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజన్సీ) ఏర్పాటుతో కేంద్రం తనకు పోలీసు అధికారాలను కట్టబెట్టుకుంది. ఈ చర్యల తార్కిక కొనసాగింపుగానే గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలను కట్టబెట్టే చర్యలకు పూనుకున్నారు. అందులో భాగమే జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం ఏర్పాటు.

రాష్ట్ర పరిధిలోని అధికారాలను కేంద్రం లాగివేసుకునే చర్యలను రాష్ట్రప్రభుత్వాలేనాడూ వ్యతిరేకించలేదు. రాష్ట్ర అధికారాల పరిధిలోకి కేంద్రం ఆక్రమణంటూ ప్రస్తుతం కొందరు ముఖ్యమంత్రులు చూపుతున్న ఆగ్రహంలో ఏమాత్రం నిజాయితీవున్నా, ఈ నిరంకుశ చట్టాలను చేస్తున్నప్పుడు వ్యతిరేకించి వుండేవారు. తద్భిన్నంగా వాటిని ఆహ్వానించారు. శాంతి భద్రతలు రాష్ట్రాల అధికార పరిధిలోనివనీ, దానికి తూట్లు పొడవరాదనీ నేడు వాదిస్తున్న ముఖ్యమంత్రుల మాటల్లో నిజాయితీవుంటే, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తొలగించాలని ఒమర్అబ్దుల్లా యిటీవల చేసిన డిమాండును సమర్ధించి వుండేవారు. ఇక్కడ ఒక విషయాన్ని మనం మరువరాదు. దేశంలోని అన్నిరకాల జాతీయ లేక ప్రాంతీయ పార్టీలన్నీ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాచే, అలాగే రాష్ట్రాల అధికారాలను కుదించివేసే నిరంకుశ చట్టాలకు మద్దతు పలికాయి. ప్రస్తుతం వారు చెరగుతున్న నిప్పులు కాంగ్రెసుపై దుమ్మెత్తిపోసి రాజకీయ లబ్ధిపొందటానికుద్దేశించినదే తప్ప ప్రజల ప్రజాస్వామిక హక్కులనూ, రాష్ట్రాల హక్కులనూ కాపాడేందుకు కాదన్నది స్పష్టమే.

జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రాన్ని ఏర్పాటుచేసే కార్యనిర్వాహక ఆజ్ఞకు చట్టబద్ధతనిస్తున్నది చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం. ఈ ఆజ్ఞప్రకారం ఈ కేంద్రం సోదాలు జరపవచ్చు; ఆస్తులు జప్తు చేయవచ్చు; చట్టాలను అమలుజరిపే ఇతర సంస్థల నుండీ, ఇతర గూఢచారి సంస్థలనుండి సమాచారాన్ని పొందవచ్చు; అరెస్టులు చేయవచ్చు; ఈ అధికారాలను వాడేందుకు సాయుధ బలగాలను పిలిపించుకోవచ్చు. ఇదంతా టెర్రరిస్టు చర్యలనూ, హింసాకాండనూ ఆపేందుకని చెబుతున్నారు.

కేంద్రం పైఅధికారాలను యుఏపిఏ చట్టం నేరాలుగా నిర్వచించిన కార్యకలాపాలను నిరోధించేందుకు వినియోగించాల్సి వుంటుంది. అయితే యుఏపిఏ "దేశ సమాఖ్యనుండి విడిపోవటం", "భారతదేశ సమగ్రత, సమైక్యతలను ఖండించటం, ప్రశ్నించటం, విచ్ఛిన్నపరచటాన్ని"; "భారత్‌లో అసంతృప్తిని రేకెత్తించటాన్నీ" చట్టవిరుద్ధ చర్యలుగా నిర్వచించింది. దీనిలో హింస, టెర్రరిస్టు చర్యల ప్రసక్తిలేదు. భారతదేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకు భంగకరంగా హింసా చర్యలకు, టెర్రరిస్టు చర్యలకు పాల్పడ్డాడన్న ఆరోపణ అవసరంలేదు. అలాంటి భావన కలిగివుండటమూ, వ్యాప్తి చేయటమూ నేరాలవుతాయి.

ఉదాహరణకు స్వయంపాలనకోసం కాశ్మీర్ ప్రజల డిమాండును బలపరుస్తూ ఒక కరపత్రాన్ని పంచిపెట్టడం నేరమౌతుంది. అప్పుడు కేంద్ర గూఢచారిసంస్థ వెంటనే అరెస్టు చెయ్యవచ్చు. దీని అర్ధమేమిటి? ప్రస్తుత పాలనా వ్యవస్థకు భిన్నమైన రాజకీయ అభిప్రాయాలను కలిగివుండటమే, టెర్రరిస్టు లేదా హింసా చర్యలకు పాల్పడకపోయినా, ఈ కేంద్రం నేరంగా పరిగణించి, నిర్బంధిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదు. "జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం తన పోలీసు అధికారాలను వినియోగించినప్పుడు రాష్ట్ర పోలీసులకు తెలియ జేస్తుంది గనుక తమ అధికారాల ఆక్రమణ గురించిన భయాలు ఉండనవసరంలేద"ని అమెరికా రాయబార కార్యాలయ అధికారి స్టీవెన్‌వైట్‌కు చిదంబరం ఇచ్చిన హామీ (ది హిందూ 1 మార్చి 2009), కేంద్రం పోలీసు అధికారాలను ఎలా దఖలు పరుచుకుంటున్నదో తెలుపుతున్నది.

ఇక సమస్య కేంద్ర - రాష్ట్రాల అధికారాల పంపకానికి పరిమితమై లేదు. గూఢచారి సంస్థలు సమాచారసేకరణ, దాని విశ్లేషణను చేసి ప్రభుత్వాని కందిస్తాయి. దానిపై ఆధారపడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అవి ప్రభుత్వానికే జవాబుదారీ. చట్టబద్ధపాలన వాటికి వర్తించదు. ప్రజల హక్కులను కాపాడే రక్షణలతో చట్టాలను అమలుజరిపే యంత్రాంగం (పోలీసులు) చట్టబద్ధ పాలనకు కట్టుబడి వుండాలి. వాటి ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాలు విచారిస్తాయి. చట్టబద్ధ పాలనకు జవాబుదారీలేని గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలుండవు.

పైగా గూఢచారి సంస్థల కార్యకలాపాలు రహస్యంగా ఉంటాయి. అవి ఎంచుకున్న పౌరులపై నిఘా వుంచటానికీ, ఫోను సంభాషణలు వినటానికీ, మన ఇళ్లల్లో సూక్ష్మ కెమేరాలుంచటానికీ వీటికి ఎవరి అనుమతీ అవసరంలేదు.

చట్టబద్ధ ఆంక్షలున్న పోలీసు వ్యవస్థే అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడేటట్లు చేస్తున్న పాలకులు, ఎలాంటి ఆంక్షలూ లేని గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలను కట్టబెట్ట బూనుకున్నారంటే, ప్రజల ప్రాథమిక, రాజ్యాంగబద్ధ పౌరహక్కులనూ, ప్రజాస్వామిక హక్కులనూ కాలరాయటంలో వెనుకాడరన్నది స్పష్టమే.

కనుక యుఏపిఏ చట్టం క్రింద, జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం ద్వారా, గూఢచారి సంస్థ ఐన ఇంటిలిజెన్స్ బ్యూరోకు పోలీసు అధికారాలను కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం రాష్ట్రాల అధికారాలను కుదించి వేయటంతో పాటు, అంతకు మించి, పౌర ప్రజాస్వామిక హక్కుల కాలరాచివేతకు పాలకుల చేతిలో ఎలాంటి ఆంక్షలూలేని నిర్బంధ సాధనమౌతుంది. కొందరు ముఖ్యమంత్రుల అసంతృప్తి, కొంత రాజకీయలబ్ధి పొందటంతో టీ కప్పులో తుఫానులా చల్లారి పోతుంది. అయితే ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులపై దాడి మరింత పదునెక్కుతుంది. ఈ దాడిని సమైక్యంగా ఎదుర్కోవలసిన కర్తవ్యం ప్రజాతంత్ర వాదులపైనా, హక్కుల సంఘాలపైనా వుంది. అందుకు పూనుకుందాం.

**(20-4-2012 'జనశక్తి' నుండి పునర్ముద్రితం)** ✡

**దిల్‌సుఖ్‌నగర్...** (మొదటి పేజీ తరువాయి)

చేయదలచుకున్న నిర్ధారణకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నం తప్ప మరొకటి కాబోదు.

ముస్లిములను టెర్రరిస్టులని పిలవటానికి ఏమాత్రం వెనుకాడని ప్రభుత్వాధినేతలూ, అధికారులూ, పత్రికలు, టీవీఛానెళ్లవారూ టెర్రరిస్టు చర్యలకు పాల్పడినట్లు తేలినా హిందూమతోన్మాద శక్తులను మితవాద సంస్థలని (రైట్‌వింగ్) పిలుస్తుండటమే; మక్కామసీదు బాంబుపేలుళ్లు హిందూమతోన్మాదశక్తుల పని అని తేలినా మాటిమాటికీ దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లతో మక్కామసీదు పేలుడుకు సంబంధాలంటూ ప్రచారం చేయటమే, రాజ్యవ్యవస్థలో ముస్లిం వ్యతిరేకవైఖరి ఎంతగా గూడుకట్టుకునివుందో తెలుపుతుంది. ఈ నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ళకు అసలు కారకులను ప్రభుత్వం బయటకు రానిస్తుందనటం సందేహాస్పదమే.

టెర్రరిజాన్ని అణచివేయటానికి సత్వర చర్యల అవసరముందంటూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వ వైఫల్యం వల్లనే బాంబుపేలుళ్లు జరిగినట్లు చెపుతూ, కేంద్రమే టెర్రరిజాన్ని సమర్ధవంతంగా అణచివేయగలదనీ ప్రచారం చేస్తున్నారు. బాంబుపేలుళ్లతో ప్రజల్లో ఏర్పడ్డ అభద్రతా భావాన్ని ఆసరా చేసుకుని నిరంకుశాధికారాలను కట్టబెట్టుకుని ప్రజాస్వామిక హక్కులను కాలరాయటానికే దోపిడీ వర్గాల పాలకులు ఈ ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఇందుకోసమే టెర్రరిస్టు వ్యతిరేక జాతీయ కేంద్రం ఏర్పాటును మళ్లీ ముందుకు తెస్తున్నారు.

ఈ కేంద్రం ఏర్పాటును ఏడాది క్రితం కేంద్రం ప్రతిపాదించగా 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు దీనిని వ్యతిరేకించారు. దానితో కేంద్రం వెనక్కుతగ్గి, మరింత చర్చించిన తర్వాత ఏర్పాటు చేస్తామంటూ వాయిదా వేసింది. దిల్‌సుఖ్‌నగర్ బాంబుపేలుళ్లతో మళ్లీ అదే ప్రతిపాదనను ముందుకు తెస్తున్నది. ఈ కేంద్రం ఏర్పాటు రాష్ట్రాల పరిధిలోని శాంతి భద్రతలను కేంద్రం తీసుకోవటమేనని ముఖ్యమంత్రులు అభ్యంతరం చెప్పారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా కేంద్రమే పోలీసు అధికారాలు వినియోగిస్తుందన్నది వారి వాదన. ఇది నిజమే. అయితే అది అక్కడికే పరిమితం కాదనీ ప్రజల ప్రజాస్వామిక హక్కులనూ, పౌరస్వేచ్ఛలనూ హరించడానికి దారితీస్తుందని "జనశక్తి" (20-4-2012) వివరించింది. (ఈ వ్యాసాన్ని పాఠకుల కొరకు ఈ సంచికలో పునర్ముద్రిస్తున్నాము). అయితే కేంద్ర ప్రభుత్వం తాను పోలీసు అధికారాలను వినియోగించే ముందు రాష్ట్రాలతో సంప్రదించే, ఈ కేంద్రాన్ని గూఢచారి సంస్థ నుండి తప్పించి స్వతంత్రసంస్థగా ఏర్పాటుచేసే సవరణలతో ముఖ్యమంత్రులను సంతృప్తి పరచి ఈ కేంద్రం ఏర్పాటు చెయ్యాలని చూస్తున్నది. అయితే ప్రజాస్వామిక హక్కులను కాలరాచే అంశాలన్నింటినీ ఏ మార్పూ లేకుండా అలాగే వుంచుతుంది. ఈ బాంబు పేలుళ్లను కూడా నిరంకుశాధికారాలను విస్తరించుకునేందుకే పాలకవర్గాలు పూనుకున్నాయి.

ఈ దుశ్చర్యను తామే చేశామంటూ ఇంతవరకూ ఏ టెర్రరిస్టు సంస్థా చెప్పుకోలేదు. అయినా పొరుగుదేశమే దీనిని జరిపించిందంటూ ప్రచారం సాగిస్తున్నారు. కసబ్, అఫ్జల్‌గురుల ఉరితీతకు ప్రతీకారమంటూ ప్రచారం సాగిస్తున్నారు. సహజ న్యాయసూత్రమైన "ఎలాంటి అనుమానానికి తావులేని విధంగా" వీరు నేరం చేసినట్లు నిరూపితంకాలేదు. వీరిని రహస్యంగా ఉరితీసి పాలకులు ప్రజలంటే తమకున్న భయాన్ని బయట పెట్టుకున్నారు. ఈ భయానికి కారణమేమిటి?

నూతన ఆర్థిక విధానాల ప్రారంభంతోనే అయోధ్య సమస్యతో దేశంలో మతోన్మాదాన్ని పెంచటం యాదృచ్ఛికంగా సాగింది కాదు. నూతన ఆర్ధిక విధానాలు ప్రజల జీవితాలను కల్లోలభరితం చేస్తాయని పాలకులకు తెలుసు. ప్రజల దృష్టి మళ్లించేందుకే మతోన్మాదాన్ని పెంచారు. ఒక ముఠా (బిజెపి) నగ్నమైన పద్ధతుల్లో హిందూ మతోన్మాదాన్ని పెంచగా, మరో ముఠా (కాంగ్రెసు) నాజూకైన పద్ధతుల్లో దాన్ని ప్రోత్సహిస్తూ మరోవైపున ముస్లిం మతోన్మాదాన్ని ప్రోత్సహించింది. భవిష్యత్తుపై ఏ ఆశాలేకుండా పోయిన యువతలో పేరుకున్న అశాంతిని సమిధలా వాడుకుని దేశంలో మత ఘర్షణలను రేపెట్టి మారణకాండను సాగించారు. ఇప్పుడు దీనినంతా కప్పిపుచ్చుకుని టెర్రరిజంపై పోరు నినాదాన్నిస్తున్నారు. సీమాంతర ఉగ్రవాదమంటూ తమ రక్తసిక్త హస్తాలను కడిగివేసుకోజూస్తున్నారు. టెర్రరిజం సాకుచెప్పి ప్రజలపై పాశవిక నిరంకుశ పాలననమలుజరిపి దోపిడీ వర్గాల పాలనను నల్లేరుపై బండిలా సునాయాసంగా సాగించుకోవాలని చూస్తున్నారు.

ప్రజలనుండి ఎంతో ఒత్తిడి వస్తేతప్ప దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల నేరస్తులను పాలకులు బయటకు రానివ్వరు. అదయినా తమ ప్రత్యర్థులను దెబ్బతీసి అధికారగద్దెనెక్కగలమనుకుంటేనే జరుగుతుంది. ఈ దోపిడీ వర్గాల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటిత పోరాటాలు సాగించినప్పుడు మాత్రమే వీటిని అదుపుచేయగలం. ఇలాంటి ప్రజాపోరాటాల నిర్మాణానికి టెర్రరిస్టు చర్యలు హానికలిగించటమేకాక, పాలకుల కుట్రలకే దోహదపడతాయని చరిత్ర పదేపదే నిరూపించింది. ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్‌లనుండీ నేటి లిబియా, మాలీ, సిరియాల వరకూ తాము పెంచి పోషించిన టెర్రరిజాన్నే సాకుగా చూపి సామ్రాజ్యవాదులు దురాక్రమణలు సాగించారు. బాబ్రీమసీదు నుండి మాలేగావ్, బొంబాయి రైలుపేలుళ్లు, ముంబాయిపై టెర్రరిస్టుదాడి, రాష్ట్రంలో గుంటూరు మసీదులో బాంబుపేలుడు నుండి గోకుల్‌ఛాట్, మక్కామసీదుపై దాడులు నేటి దిల్‌సుఖ్‌నగర్ ప్రేలుళ్లవరకూ టెర్రరిస్టు దాడులన్నీ పాలకులు ప్రజలను అణచేందుకే వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలోనే సంఘ పరివార్ ముఠా బరితెగించి గుజరాత్‌లో ఊచకోతను సాగించింది.

పాలకులెన్ని కుట్రలు చేసినా, ప్రజలమధ్య మతపర వైషమ్యాలు, ఘర్షణలూ పెంచాలని చూసినా, భారత శ్రమజీవులు తరతరాలుగా నిర్మించుకున్న సహజీవన, సహనాలను కాపాడు కుంటూనే వస్తున్నారు. ఇలాంటి టెర్రరిస్టు చర్యలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మతఘర్షణలకు దారితీయక పోవటానికిదే కారణం. ఈ రాష్ట్రంలో మతఘర్షణలు ప్రత్యేకించి హైద్రాబాదు నగరంలో సాగినవి- పాలకవర్గ పార్టీలు తమ నీచ సంకుచిత ప్రయోజనాల కొరకు పథకం ప్రకారం సృష్టించినవే.

ఈ అనుభవంనుండి, టెర్రరిజాన్ని అనుసరణీయ విధానం కాదని ఖండిస్తూ, పాలకులు సంకుచిత ప్రయోజనాలతో రెచ్చగొడుతున్న మతోన్మాదాన్ని చివరికంటా వ్యతిరేకించటమూ, దీనివల్ల ముఖ్యంగా మధ్యతరగతి (అ)భద్ర జీవులలో పేరుకుపోతున్న అపోహలను తొలగించటమూ, మైనారిటీలపై పాలకులు సాగిస్తున్న విచక్షణా రహిత దాడులను ఖండించటమూ, ప్రజాస్వామిక హక్కులపై సాగుతున్న దాడులపై ఎక్కుపెట్టి పోరాటం సాగించటమూ ప్రజాస్వామిక శక్తులందరి కర్తవ్యం. ✡

# బందీల శిబిరాల్లో మిజోరం పౌరుల అణచివేతకు పాల్పడ్డ భారతపాలకులు

**1966లో** మిజోరంలోని మిజో జాతీయసైన్యం తిరుగుబాటు చేసింది. ఈ తిరుగుబాటును ఎదుర్కొనే పేరిట నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నాయకత్వాన వున్న భారతప్రభుత్వం, ఆ ప్రాంతాన్ని సైన్యంతో ముంచి ఆ ప్రాంతంలోని తిరుగుబాటుదారులతోబాటు, సాధారణ ప్రజలను కూడా దారుణంగా అణచి వేసింది.

ఐజ్వల్ నగరంపై అస్సాం రైఫిల్సుకి చెందిన దళాలు మిషన్‌గన్నులతో కాల్పులు జరిపాయి. ఐజ్వల్ తదితర పట్టణాలపై మంటలను వెదజల్లే బాంబులు వేశాయి. అప్పుడు ఐజ్వల్ నగరంలో, ప్రధాన ప్రాంతాలైన రిపబ్లిక్ వెంగ్, హిమిచ్‌షె వెంగ్, దవ్‌ప్రి వెంగ్, చింగా వెంగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

ఈ సైనిక దాడులకు భీతిల్లి భయాందోళనకు గురైన స్థానిక ప్రజలు కొండల్లోకి పారిపోయారు.

మార్చి 6 నుండి మార్చి 13 వరకూ వాయుసేన అక్కడ బీభత్సం జరిపింది. ఆ సందర్భంగా జి.జి.స్వెల్ మరియు రెవరెండ్‌రాయ్‌లు ఏర్పాటు చేసిన మానవహక్కుల కమిటీ ముందు సాక్ష్యం చెప్పిన స్థానికులు నాడు తమ ప్రాంతంలో వైమానిక సైన్యానికి చెందిన హెలికాప్టర్లు, విమానాలూ నిప్పులు కురిపించాయనీ, పొగను వెదజల్లాయనీ తెలిపారు. ఈ రకంగా మొట్ట మొదటిసారిగా, భారతదేశ సైన్యానికి చెందిన వాయుసేన, భారతప్రజలపైననే యుద్ధం జరిపింది. అయితే భారత ప్రభుత్వం, భారతసైన్యాలు మాత్రం 1980 వరకు తాము మిజోరంలో విమానాలతో దాడి జరపలేదంటూనే బుకాయించారు. 1967లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్‌ఎస్‌పిఏ) అమలులో వుంది. ఆనాడు తూర్పు సైనిక విభాగానికి ప్రధాన అధికారిగా వున్న లెఫ్టినెంట్ జనరల్ మానిక్‌షా, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా వున్న భారత ప్రభుత్వం మరో దారుణమైన అణచివేత చర్యకు పాల్పడ్డారు. అదే "గ్రామాలను తిరిగి సముదాయాలుగా ఏర్పరచటం" అన్న అణచివేత విధానం.

సైనికుల యీ పథకం ప్రకారం, మిజోరంలో అప్పటికి గల అడవులలోనూ, కొండల్లోనూ వ్యాపించి వున్న వందలాది గ్రామాలన్నింటినీ ఒకే చోటకు చేర్చి – దక్షిణ అస్సాంలోని సిల్చార్ ప్రాంతం నుండి వచ్చే రహదారి పక్కకు తీసుకురావటం. దీనికే "రక్షిత అభ్యుదయ గ్రామాలు" అనే అందమైన పేరును పెట్టారు. వాస్తవానికి ఈ రకంగా ఏర్పాటు చేయబడ్డ "రక్షిత అభ్యుదయ గ్రామాలు" అన్నవి బందీల శిబిరాలు (కాన్సెంట్రేషన్ క్యాంపులు) తప్ప మరేమీకావు. కాకపోతే వీటిల్లో "విషవాయువు గదులు"(బందీలను చంపేందుకు) మాత్రం లేవు.

మిలటరీ అధికారుల ప్రకారం, భారతప్రభుత్వం ప్రకారం ఈ "రక్షిత అభ్యుదయ గ్రామాల"నబడే వాటిలోకి స్థానిక ప్రజలు స్వచ్ఛందమైన చొరవతో సంతోషంతో ప్రవేశించారు. కానీ వాస్తవాలు అందుకు పూర్తిగా వ్యతిరేకంగా వున్నాయి.

నిజానికి తమ గ్రామాలకు వందల మైళ్ళ దూరంలో వున్న ఈ శిబిర గ్రామాల్లోకి తమ భూములను, పంటలను, యిళ్ళనూ వదలిపెట్టి వెళ్ళటానికి మిజోరం ప్రజలు వ్యతిరేకించారు. వాళ్ళను మిలటరీ వాళ్ళు బలవంతంగా ముందుకు సాగమని – వాళ్ళు మోసుకుపోగల్గిన సామాన్లను మోసుకుని, మిగిలినవి కాల్చిపారవేయమని ఆజ్ఞాపించినపుడు, తమ ఆస్తులను తగులబెట్టడానికి వారు తిరస్కరించారు. కానీ సైనిక అధికారులు గ్రామ పెద్దలపై తుపాకీ ఎక్కుపెట్టి, వాళ్ళు అందుకు అంగీకరిస్తున్నట్లు తెలిపే పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టించుకొన్నారు. గ్రామస్తులను బలవంతంగా వారి గ్రామాల నుండి శిబిర గ్రామాలకు తరలించిన సందర్భాలలో సైనికులే ఆ గ్రామీణులకు స్వగ్రామాలలో మిగిలిన ఆస్తులను తగులబెట్టేశారు.

ఈ శిబిర గ్రామాలలో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. ఈ గ్రామంలోకి నెట్టబడ్డ ప్రతీపౌరునికీ ఒక సంఖ్యను యిచ్చి, ఆ సంఖ్యను అతడి బట్టలపై తగిలించారు. శిబిర గ్రామం నుండి బయటకు వెళ్ళడాన్నీ, బయటనుండి శిబిర గ్రామంలోకి రావటాన్నీ సైన్యం అదుపుజేస్తూ, పరిమితం చేసింది. వారికి నామమాత్రపు రేషన్లు యిచ్చారు. శిబిర గ్రామాల పరిధులకు లోబడి, ఆ మిజోరం ప్రజలు తమ సాంప్రదాయక, గిరిజన ఆచార వ్యవహారాలకు దూరం చేయబడ్డారు. ఆ శిబిర గ్రామాలలో వనరుల కొరత వలన, అక్కడ దొంగతనం, హత్యలు, త్రాగుడు దుర్వ్యసనాలు విపరీతంగా వ్యాపించాయి.

ఈ రకంగా గ్రామాలను తిరిగి గ్రామ సముదాయాలుగా ఏర్పరచటం వలన మిజోప్రాంతంలో గిరిజనులు సాంప్రదాయకంగా అవలంబించే సాగు పద్ధతి అయిన "ఝూమ్" వేదం (పంటలను మార్పటం) అనే పద్ధతి ధ్వంసం చేయబడింది. రక్షిత అభ్యుదయ గ్రామ సముదాయాల్లో తక్కువ భూమి వుండటం వలన వదిలివేయబడ్డ "ఝూమ్" వ్యవసాయం చేసే భూములు, చాలాదూరంలో లోతట్టులో వుండటం వలన ఈ వ్యవసాయ పద్ధతి ధ్వంసమయింది. వ్యవసాయ పంటల ఉత్పత్తి ఘోరంగా పడిపోయింది. దీనితో మిజోరం రాష్ట్రం దరిదాపుగా క్షామం బారిన పడింది. 3 సంవత్సరాలపాటు, మిలటరీవారు సమకూర్చిన ఆహారంతోనే ఆ రాష్ట్ర ప్రజలు సరిపెట్టుకోవల్సివచ్చింది.

తిరుగుబాటుదారులకు ప్రజలు ఆశ్రయాన్ని యివ్వకుండా నివారించేందుకు, ప్రజలు మిజోరం జాతీయ సైన్యంలో చేరకుండా నివారించేందుకు ప్రజలను తమ కంటి ముందే వుంచుకోవటం అన్న, ఈ గ్రామ సముదాయాలను పునర్నిర్మించటం అన్న విధానాన్ని సైన్యం చేబట్టింది. ఆ రకంగా తిరుగుబాటుదారులకు ఆశ్రయమూ, ఆహారమూ అందకుండా చేయటం కోసం, మిజోరంలో వున్న అసలు గ్రామాలను, పంటలను, ధాన్యాగారాలనూ నాశనం చేయటం అన్న విధానాన్ని భారతసైన్యం, భారతప్రభుత్వపు మద్దతుతో అమలు జరిపింది.

ఆ రకంగా గతంలో బ్రిటిష్ వలస పాలకులు అమలు జరిపిన మాదిరి – 20వ శతాబ్దంలో బోయర్ యుద్ధకాలంలో మలయాలో చైనీయులను నిర్బంధ క్యాంపుల్లో నిర్బంధించిన మాదిరి, గ్రామాలను పునర్ సముదాయాలుగా ఏర్పరచిన మాదిరి, కెన్యాలో మోమో తిరుగుబాటు దారులను అణచటం కోసం గ్రామాలు–గ్రామాలనే పెకలించి పారవేసిన మాదిరి–భారత పాలకులు –ప్రభుత్వం, తన దేశానికి చెందిన ప్రజలనే – వలస పాలకులు పాలిత ప్రజలను అణచిపెట్టిన మాదిరి అణచిపెట్టడం జరిగింది.

మిజోరంలో గల 764 గ్రామాల్లో 516 గ్రామలను ఖాళీచేయించి 110 "రక్షిత అభ్యుదయ గ్రామాలు"గా కుదించారు. ఐజ్వాల్ ప్రాంతంలో 95% మంది ప్రజలను ఈ శిబిర గ్రామాలలోకి బలవంతంగా తరలించారు. ఈ రకంగా యింత పెద్దఎత్తున స్థానిక ప్రజలను, ఆఖరుకు జర్మన్ కాన్సెంట్రేషన్ క్యాంపుల్లోకి కూడా హిట్లర్ ప్రభుత్వం బలవంతంగా తరలించి నిర్బంధించలేదు.

1971 నుండి మొదలుపెట్టి 1979 నాటికి ఈ శిబిర గ్రామాలను రద్దుచేయటం అన్నది జరిగింది. అయినా నేటికీ భారతపాలకులు ఈరకంగా మిజోరం ప్రజలపై బాంబులు వేసినందుకుగానీ, గ్రామ సముదాయాలను పునర్నిర్మించినందుకుగానీ తన పొరపాటును అంగీకరించలేదు.

ఈ రకంగా గత 66 సంవత్సరాలుగా భారత పాలకులు ఈశాన్య రాష్ట్రాల, జమ్మూకాశ్మీర్ ప్రజలను పరోక్ష సైనికపాలన ద్వారా అణచిపెడ్తూనే, మనది ప్రజాస్వామ్య దేశమంటూ వాస్తవాలను మరుగుపరచి ప్రచారం కావిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

జాతీయ దేశంలో ఏ ప్రాంతంలో, ఎక్కడ ప్రజలు తమ ప్రజాస్వామిక ఆకాంక్షలను వ్యక్తంచేసినా, ఆ ఆకాంక్షలను పట్టించుకోకుండా, తిరస్కరిస్తూ, సైన్యం ద్వారా వాళ్ళ నోరునొక్కి వేస్తున్నారు. ప్రజాస్వామికంగా ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేయటాన్ని వ్యతిరేకిస్తున్నారు. వివిధ జాతుల ప్రజలను, ప్రత్యేకించి గిరిజనులను సైనిక పాలన ద్వారా అణచివేస్తున్నారు.

అందుకనే జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల ప్రజల న్యాయసమ్మతమైన సాయుధ సైనికుల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండును మిలటరీ అంగీకరించటల్లేదు అనే సాకుతో, తిరస్కరిస్తున్నారు. ఆరకంగా సైన్యాధికారుల యిష్టం పేరిట దేశంలో సైనికపాలన సాగించటానికి తమ అంగీకారాన్ని తెలియచేస్తున్నారు. మరోవైపు గిరిజనుల ఉద్ధరణ అనే మోసపూరిత నాటకం ఆడుతూ, వాస్తవాలు తెల్సుకోకుండా, అర్థం చేసుకోకుండా యితర ప్రాంతాల ప్రజలను మోసం చేస్తున్నారు.

*(అభీక్ బార్మన్ వ్యాసం ఆధారంగా)*

★

# విదేశాలకు ప్రవాహంలా తరలుతున్న సంపద

**విదేశీ** కంపెనీలు భారత్‌నుండి తమ దేశానికి తరలిస్తున్న సంపదను అంచనావేయటం అసాధ్యంగా మారిందనీ, ఈ సంపద తరలింపు దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడిని మించిపోయిందనీ కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన గ్రంథం "తాకట్టులో భారతదేశం"లో వ్యాఖ్యానించారు. అంతేకాక, కేవలం 6 లక్షల రూపాయల పెట్టుబడిపెట్టిన కోకోకోలా కంపెనీ మూడేళ్లలో 136 లక్షల రూపాయలను లాభాలరూపంలో తరలించుకు పోయిన తీరును వివరించారు.

నాలుగు దశాబ్దాల తర్వాత ఈ సంపద తరలింపు వరదలా ప్రవహిస్తున్నది. విదేశీ బహుళజాతి కంపెనీలు భారత్‌లోని తమశాఖల ద్వారానూ, మిలాఖత్తు కంపెనీల ద్వారానూ సంపదను తరలించేందుకు అనేక మార్గాల నెంచుకున్నాయి. 1. ఇంజనీరింగు సేవలు 2. సాంకేతిక సమాచార సేవలు 3. యాజమాన్య సేవలు 4. రాయల్టీలు 5. లైసెన్సు ఫీజులు 6. విదేశంలోని కేంద్ర కార్యాలయం ఖర్చులు 7. విదేశీ కంపెనీ యిచ్చిన రుణంపై వడ్డీలు 8. ప్రత్యేకంగా పేర్కొనని ఖాతాలద్వారా భారతదేశం నుండి సంపదలను దోచుకుపోతున్నాయి.

వీటిలో ఒకటి రాయల్టీల చెల్లింపు. విదేశీ కంపెనీ సరుకుల బ్రాండు పేరు వాడుకున్నందుకూ, వాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని, యాజమాన్య పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నందుకు చెల్లించే సొమ్మునే రాయల్టీ అంటారు. 2009లో భారత ప్రభుత్వం రాయల్టీల చెల్లింపుల నిబంధనలను సడలించింది. దీనికనుగుణంగా రిజర్వు బ్యాంకు విదేశీ మారకద్రవ్య నిర్వహణా చట్టంలో రాయల్టీల చెల్లింపులపై నిబంధనలను తొలగించింది. దీనితో విదేశీ కంపెనీలకు రాయల్టీల చెల్లింపు రెట్టింపుకు పైగా పెరిగాయి.

ఈ రెండు పట్టికలను గమనిస్తే, 2012లో మారుతీ సుజుకీ కంపెనీ జపానులోని సుజికి కంపెనీకి రూ॥1800 కోట్లు రాయల్టీగా చెల్లించింది. ఆ ఏడాది దానికొచ్చిన లాభాలు రూ॥1681 కోట్లు మాత్రమే. నిబంధనల సడలింపుకు ముందు 2009లో అది చెల్లించిన రాయల్టీలు 900 కోట్లు. అలాగే హిందూస్తాన్ లీవర్, ఎబిబి వంటి కంపెనీలు వందలకోట్లు రాయల్టీగా చెల్లించాయి. మొత్తం

పట్టిక:1 భారత్‌లోని బహుళజాతి కంపెనీలు చెల్లిస్తున్న రాయల్టీలు 2012

| కంపెనీ | అమ్మకాలు (కోట్ల రూ) | రాయల్టీలు (కోట్ల రూ) | లాభాలు (కోట్ల రూ) | అమ్మకాల్లో రాయల్టీ % |
|---|---|---|---|---|
| మారుతి సుజుకి | 36089 | 1803 | 1681 | 5.0 |
| హిందూస్తాన్ లీవర్ | 23436 | 307 | 2790 | 1.3 |
| ఏబిబి | 7372 | 168 | 184 | 2.3 |
| కాల్గేట్–పామోలివ్ | 2693 | 141 | 446 | 5.2 |
| ఏసిసి | 10012 | 138 | 1300 | 1.4 |
| బోష్ | 7992 | 129 | 1122 | 1.61 |
| గ్లాస్కోస్మిత్ | 2685 | 93 | 355 | 3.5 |
| కాస్ట్రాల్ ఇండియా | 3082 | 73 | 481 | 2.4 |

ఆధారం: ఇకనామిక్ టైమ్స్ 21-1-2013

పట్టిక:2 2012లో కొన్ని కంపెనీలు చెల్లించిన రాయల్టీలు

| కంపెనీ | అమ్మకాలు (కోట్ల రూ) | రాయల్టీలు (కోట్ల రూ) | లాభాలు (కోట్ల రూ) | అమ్మకాల్లో రాయల్టీ % |
|---|---|---|---|---|
| ఓఎన్‌జిసి | 146211 | 15531 | 28143 | 10.6 |
| కావేరీ సీడ్ | 372 | 36 | 58 | 9.9 |
| జిఎండిసి | 1630 | 148 | 486 | 9.1 |
| ఎన్ఎండిసి | 11262 | 1022 | 7265 | 9.1 |
| ఏబిజిఇన్‌ఫ్రా | 252 | 22 | -39 | 9.0 |
| ఆయిల్ ఇండియా | 17215 | 1355 | 3469 | 7.9 |
| కోల్ ఇండియా | 75013 | 5537 | 14788 | 7.4 |

ఆధారం: ఇకనామిక్ టైమ్స్ 21-1-2013

49 బహుళజాతి కంపెనీలు 2012లో రూ॥3500 కోట్లు రాయల్టీగా చెల్లించాయి. 2009లో ఇవి చెల్లించిన రాయల్టీలు రూ॥1129 కోట్లు.

భారత మిలాఖత్ కంపెనీలకొస్తే, 806 కంపెనీల లెక్కలను తీసుకుంటే అవి మొత్తంగా రూ॥34,490 కోట్లు రాయల్టీగా చెల్లించాయి. ఇది వాటికొచ్చిన లాభాల్లో 27 శాతంకాగా, అమ్మకాల్లో 2 శాతం. సడలింపుకు ముందు ఇవి చెల్లించిన రాయల్టీలు లాభాల్లో 16 శాతంగానూ, అమ్మకాల్లో 1.7 శాతంగా వుంది. (దాదాపుగా రూ॥ 24000 కోట్లు) 2012లో చెల్లించిన రాయల్టీలలో సగానికి పైగా అంటే రూ॥16886 కోట్లు ఓఎన్‌జిసి, ఆయిల్ ఇండియాలు చెల్లించాయి. మరో రెండు ప్రభుత్వరంగ సంస్థలు ఎన్.ఎం.డి.సి., కోల్‌ఇండియాలు రూ॥6559 కోట్లు చెల్లించాయి. దాదాపు సగం ప్రభుత్వరంగ సంస్థలే చెల్లించాయి. ఏబిజి ఇన్‌ఫ్రా అన్న కంపెనీ రూ॥22 కోట్లు రాయల్టీగా చెల్లించి 39 కోట్లు నష్టాలు పొందింది.

కంపెనీలకు ఎక్కువ ఆదాయమూ, లాభాలూ వచ్చినందున రాయల్టీ చెల్లింపులు పెరిగాయనటానికి అవకాశం లేదు. గత ఐదేళ్లలోనూ బహుళజాతి కంపెనీల లాభాలు 20శాతమూ, అమ్మకాలు 70శాతమూ పెరగ్గా, రాయల్టీలు మూడురెట్లు(300%) పెరిగాయి. వాస్తవానికి పెరిగిన రాయల్టీల చెల్లింపులతో వీటి లాభాలు 11శాతం నుండి 7.6 శాతానికి తగ్గాయి.

రాయల్టీల పేరిట దోపిడీ ఎంత తీవ్రస్థాయిలో వుందో తెలియాలంటే మరికొన్ని వివరాలు చూద్దాం. 2010–11 ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు రూ॥77902 కోట్లు. దీనిలో సగానికి పైగా, అంటే రూ॥38081 కోట్లు రాయల్టీలుగా తరలిపోయింది. లాభాలు, ఇతర తరలింపులను కలుపుకుంటే విదేశాల నుండి వచ్చిన పెట్టుబడులను మించిపోతాయి. మరోవిధంగా చూస్తే దేశ పురోగతికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే ముఖ్యమంటూ వాటికి గేట్లు తెరుస్తున్నారు. 2010–11లో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐలు 2205 కోట్ల డాలర్లు. అంటే దాదాపు 1 లక్షా 10వేల కోట్ల రూపాయలు. అంటే దానిలో 3వ వంతు రాయల్టీల రూపంలో విదేశాలకు తరలివెళ్లింది.

భారతదేశ ఆర్థిక వనరులనూ, ఖనిజ వనరులనూ వినియోగించుకుంటూ, భారత కార్మికుల శ్రమతో నడుస్తున్న ఈ పరిశ్రమలలో సృష్టింపబడిన సంపదను విదేశాలకు తరలిస్తున్నాయి. ఈ లాభాలతో మరో పరిశ్రమ పెట్టుకునేందుకు వీలులేకుండా చేస్తున్నాయి. మళ్లీ ఏ విదేశీ కంపెనీ వచ్చి పరిశ్రమ పెడుతుందోనని ఎదురు చూస్తూ వారికి సకల సౌకర్యాలూ కల్పించేందుకు సిద్ధమౌతున్నారు. అందుకనే "విదేశీ పెట్టుబడి అంటే విదేశీ మారకద్రవ్య సంక్షోభాన్ని తీవ్రపరిచి మరల పెట్టుబడి పెట్టడానికి వీలులేకుండా పెట్టుబడి సమీకరణను కుదించివేసే నిరంతరాయమైన సంపద తరలింపు. ఇది దేశాన్ని శాశ్వతంగా పరాధీనం చేస్తుంది" అని కామ్రేడ్ టి.ఎన్.అన్నారు. (తాకట్టులో భారతదేశం, పేజీ 247)

ఆనాటికంటే ఈ సంపద తరలింపుకు మార్గాన్ని భారత పాలకవర్గాలు సుగమం చేశాయి. భారత పరాధీనతను శాశ్వతం చేస్తున్నాయి. బయటపడలేని విధంగా సామ్రాజ్యవాద రక్కసుల కబంధ హస్తాలలోకి భారత్‌ను పడద్రోశారు.

★

# ఆహార కొరత - పోషకాహార లోపంతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు

**భారతదేశంతో** సహా మూడవ ప్రపంచ దేశాల్లోని పేద ప్రజలు కడుపునిండా ఆహారం దొరక్క ఆకలితో హాహాకారాలు చేస్తున్నారు. పోషకాహారం లభించక అనేక రోగాలకు గురౌతున్నారు. స్త్రీ, పురుష, పిల్లలు అనే భేదం లేకుండా ప్రతి సంవత్సరం కోట్లాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. పనిచేసుకొని ప్రాణాలు నిలుపు కొందామన్నా ఉపాధి లభించని పరిస్థితి ఏర్పడింది. పేదలు ఆహారం కోసం అలమటిస్తుంటే పెట్టుబడిదారీ దేశాల్లోని సంపన్నులు పోషక ఆహారం ఎక్కువై అవస్థలు పడుతున్నారు.

ఆదిమ సమాజం అంతరించే క్రమంలోనే ప్రజలు వర్గాలుగా విభజించబడ్డారు. తెగల మధ్య యుద్ధాలు జరిగినపుడు, ఓడిపోయిన తెగలో బ్రతికున్న వారిని చంపకుండా బందీలుగా చేసుకొని వారిచేత విపరీతమైన శ్రమ చేయించి, వారు సృష్టించే సంపదలన్నీ స్వాధీనం చేసుకొని గెలిచిన తెగ అనుభవించేది. ఆ విధంగా బానిస సమాజంలో శ్రమ దోపిడీకి అంకురార్పణ జరిగింది. బానిస సమాజంలో బానిసలు–బానిస యజమానులుగా విభజింపడి, బానిసలకు ఎటువంటి హక్కులు లేకుండా చేసి, వారి శ్రమను బానిస యజమానులు దోచుకొన్నారు. బానిసలు అతి నికృష్టమైన జీవితాలు గడిపారు. భూస్వామ్య వ్యవస్థలో ఫ్యూడల్ ప్రభులు–రైతులు, చేతివృత్తులవారుగా వర్గాలు ఏర్పడ్డాయి. భూస్వాములకు వెట్టిచాకిరీ చేసి రైతాంగం పంటలు పండించి, సంపదలు సృష్టిస్తే ఆ సంపదలను ఫ్యూడల్ ప్రభులు, భూస్వాములు భుక్తం చేసుకొని విలాసవంతమైన జీవితాలు గడిపారు. రైతాంగం తిండిలేక ఆకలితో అలమటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు–కార్మికులు, పెటీబూర్జువాలుగా సమాజం విభజించబడింది. బానిస, ఫ్యూడల్ సమాజం కన్నా శ్రామికులకు కొంత స్వేచ్ఛ లభించినప్పటికీ శ్రమదోపిడీ మాత్రం కొనసాగుతూనే ఉంది. శ్రామికులకు యిచ్చే వేతనం కన్నా అదనంగా పనిచేయించి వారి శ్రమశక్తిని కొల్లగొట్టటం ద్వారా కోట్లాది రూపాయలకు పెట్టుబడిదారులు పడగలెత్తారు. శ్రామికులు అర్ధాకలితో జీవితాలు కొనసాగిస్తున్నారు. బానిస యజమానులు, ఫ్యూడల్ ప్రభువులు, పెట్టుబడిదారులు –బానిసల, రైతుల, కార్మికుల శ్రమశక్తిని కొల్లగొట్టి సంపదలు పోగుచేసుకొంటే, ఆ సంపదలు సృష్టించినవారు తిండికోసం అలమటించారు. సంపదలు కొద్దిమంది చేతుల్లోనే పోగుపడ్డాయి. అత్యధికులకు వాటిపై హక్కు లేకుండా పోయింది. బానిస సమాజంలో రాజ్యాంగ యంత్రం స్పష్టమైన రూపు తీసుకొని పెట్టుబడిదారీ వ్యవస్థలో మరింత పకడ్బందీగా రూపొందింది. ఈ రాజ్యాంగ యంత్రం (మిలటరీ–కోర్టులు–చట్టం) భూస్వాముల మీద, పెట్టుబడిదారుల మీద తిరగబడకుండా పేదలను అణచిపెట్టేందుకు సాధనంగా చేసుకున్నారు. అయినప్పటికీ దోపిడీ–అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలు అనేక తిరుగుబాట్లు, విప్లవాలు నడిపారు. విప్లవాల ద్వారానే నూతన సమాజాలు ఏర్పడ్డాయి.

పెట్టుబడిదారీవిధాన అత్యున్నత దశ సామ్రాజ్యవాదంగా రూపొంది జర్మనీ, జపాన్, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు సామ్రాజ్యవాద దేశాలుగా రూపాంతరం చెందాయి. మూడవ ప్రపంచ దేశాలను కొల్లగొట్టేందుకు, వాటిపై ఆధిపత్యం వహించేందుకు యుద్ధాలకు దిగాయి. ఆ విధంగా వచ్చినవే మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు. ఈ యుద్ధాలు కోట్లాదిమంది ప్రజల ప్రాణాలను బలిగొన్నాయి. సామ్రాజ్యవాదాన్ని–ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదాన్ని చైనా, వియత్నాం, క్యూబా మొదలైన దేశాల్లో ప్రజలు ప్రతిఘటించి దాన్ని దెబ్బతీశారు.

ఇలాంటి నేపథ్యంలో సామ్రాజ్యవాదం, తన దోపిడీ విధానాల్లో మార్పులు చేసుకొంది. ప్రత్యక్ష వలసపాలన స్థానంలో అర్ధవలస/నయావలస విధానాన్ని ప్రారంభించింది. మూడవ ప్రపంచ దేశాల్లోని భూస్వాములతో, పెట్టుబడిదారులతో కుమ్మక్కై, తన దోపిడీ ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొంటున్నది. తన మాట పూర్తిగా వినని ప్రభుత్వాలపై దాడిచేసి, తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొంటున్నది. ఐ.యం.ఎఫ్, ప్రపంచ బ్యాంక్‌ల ద్వారా తన ప్రయోజనాలు కాపాడుకొంటున్నది. ప్రపంచ మార్కెట్‌ని కొల్లగొట్టేందుకు నూతన ఆర్థికవిధానాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయ ఒప్పందాలను మూడవ ప్రపంచ దేశాలపై బలవంతంగా రుద్దింది. ఆ దేశాల్లోని పారిశ్రామిక రంగంపై సామ్రాజ్యవాదం ఆధిపత్యాన్ని నెరపుతున్నది. జాతీయ పరిశ్రమలను, జాతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్నది. ఆ దేశాల సహజ సంపదలన్నింటినీ తరలించుకుపోతున్నది. తద్వారా అక్కడి ప్రజలను పేదలుగా మార్చింది. అమెరికా సామ్రాజ్యవాదం, యూరప్‌లోని సామ్రాజ్యవాద దేశాలు వారి దేశాల్లోని భూ ఎస్టేట్ దారులకు పెద్దఎత్తున వ్యవసాయ సబ్సిడీలు యిచ్చి, చౌకధరలతో ఆహార పదార్థాలను ముంచెత్తి, మూడవ ప్రపంచదేశాల వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. పాలకుల సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా ఉత్పత్తి ఖర్చులు ఎక్కువై మూడవ ప్రపంచదేశాల రైతులు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడలేక నష్టాలపాలౌతున్నారు. సామ్రాజ్యవాద దేశాల్లోని సంపన్నుల అవసరాలను తీర్చేవిధంగా మూడవ ప్రపంచదేశాల పాలకులు వ్యవసాయ విధానాలను అమలు జరపటంతో ఆహార ఉత్పత్తులు గణనీయంగా పడిపోయి ఆహార కొరత ఏర్పడుతున్నది. మార్కెట్ అమ్మకాల కోసం అవసరమైన ఉత్పత్తుల కోసం కాంట్రాక్టు, కార్పొరేట్ సేద్యాన్ని అమలు జరిపేందుకు రైతుల భూములను అందుకోసం పెద్దఎత్తున ఆ సంస్థలకు సమకూర్చిపెడుతున్నది. బడా బహుళజాతి సంస్థలు వెనుకబడిన దేశాల్లోని భూములను పెద్దఎత్తున కైంకర్యం చేస్తున్నాయి. ఆ దేశాల పాలకులు, ప్రభుత్వ భూములనే కాకుండా రైతుల భూములను కూడా ఈ సంస్థలకు కట్టబెడుతున్నారు. ఫలితంగా ఆ దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. పేదలకు ఆహారం అందుబాటులో లేకుండా పోయింది. కార్పొరేట్–కాంట్రాక్టు వ్యవసాయం వలన, సేద్యంలో యంత్ర వినియోగం, పరిశ్రమల మూసివేత వలన ఉపాధి అవకాశాలు తగ్గి పేదల ఆదాయం తగ్గి వారి కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోయింది. ఆహార వస్తువులు కొనలేని పరిస్థితి ఏర్పడింది.

ఆయా దేశాల పాలకుల దోపిడీ, సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా సేద్యానికి భూమిలేక, చేయటానికి పని దొరక్క, ఆహార అవసరాలు తీరక చస్తూ, బ్రతుకుతూ పేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆహారం కోసం అలమటిస్తున్నారు. ప్రపంచంలో ఆహారం అందుబాటులో లేక పేదలకు ఈ పరిస్థితి ఏర్పడలేదు. 2010లో ఆహార ఉత్పత్తులను పరిగణలోకి తీసుకొంటే ప్రతివ్యక్తికీ 100 కిలోల బియ్యం 1130 కిలోల గోధుమలు, 100కిలోల మొక్కజొన్న తగినంతగా నూనె అందించవచ్చు. కానీ ఆ సంవత్సరం 95 కోట్ల మంది ఆకలితో అలమటించారు. ప్రపంచ ఆహార సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) ఇటీవల ప్రకటించిన నివేదిక ప్రకారం ప్రపంచ ప్రజల అవసరాల కన్నా ఆహార ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయి. నేడు ప్రపంచ వ్యాపితంగా లభించే ఆహార ఉత్పత్తులు ప్రపంచ జనాభా 7 వందల కోట్ల మందికే కాకుండా మరో ఐదు వందల కోట్ల మందికి సరిపోతాయి. అలాంటప్పుడు ఆహార కొరత ఎందుకు ఏర్పడుతున్నది? పేదలకు ఆహారం అందుబాటులో లేకుండా పోయిందీ అన్నదానికి సంపదలు కొద్దిమంది చేతుల్లో పోగుబడి ఉండటంతో పాటు బహుళజాతి సంస్థలు కారణం అన్న సమాధానం వస్తుంది. ఫ్యూచర్‌ట్రేడ్ (భవిష్య వ్యాపారం) పేరుతో పంటల దిగుబడులను అంచనా వేసి, బడా వ్యాపారవర్గం ఆహార ఉత్పత్తులను నిల్వ చేస్తున్నాయి. రైతుల నుండి ఇదంతా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాల్లోని ప్రభుత్వాలనే తారుమారు చేయగల వాల్‌మార్ట్ లాంటి బహుళజాతి సంస్థలు లక్షల టన్నుల ఆహార ధాన్యాలను మార్కెట్‌లో బ్లాక్‌చేసి, చిల్లర వ్యాపారులు పోటీలో లేకుండా చేయటానికి కొంతకాలం తక్కువ ధరలకు అమ్మి ఆ తర్వాత ధరలను పెద్దఎత్తున పెంచి వేల కోట్ల లాభాలు గడిస్తున్నాయి. ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో పేదలు ఆహారానికి దూరమౌతున్నారు.

మూడవ ప్రపంచ దేశాల్లో అనేక సహజసంపదలు, అపారమైన శ్రామికశక్తి అందుబాటులో ఉన్నప్పటికీ, అవి దేశ ప్రజల అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడటం లేదు. వీటన్నింటినీ సామ్రాజ్యవాదులు తరలించుకు పోవటంతో ఈ దేశాల్లో పేదరికం తాండవిస్తున్నది. ఆహారం దొరక్క అల్లాడుతున్నారు. అనేక రోగాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. 2005 ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం పోషకాహార లోపం వలన వెనుకబడిన దేశాల్లో 33% మంది గిడసబారి పోతున్నారు. 5సం॥లోపు పిల్లలు ప్రతిసంవత్సరం 60 లక్షల మంది చనిపోతున్నారు. ఆహారలోపం వలన ప్రతిరోజూ 16 వేల మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారు. 30 శాతం మంది పిల్లలు బరువు తక్కువతో ఉన్నారు. దక్షిణాసియా, ఆఫ్రికా ఖండాల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంది. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో 50% మంది పిల్లలు తక్కువ బరువుతో రోగాల పాలౌతున్నారు. వెనకబడిన దేశాల్లోని 50% మంది పిల్లలు, వారు తీసుకునే ఆహారంలో ఐరన్ శాతం తక్కువగా ఉండటం వలన రక్తహీనత, బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నారు. పోషకాహార లోపం ఎక్కువగా మహిళల్లోనే ఉంది. భారతదేశంలో 50% గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో బాధపడుతుండగా, ఆఫ్రికాలో 57%, ఆసియాలో 48% మంది స్త్రీలు రక్తహీనతతో ఉన్నారు. పెట్టుబడిదారీ దేశాలైన అమెరికా, యూరప్‌లలో 5%లోపు మాత్రమే ఉన్నారు. భారతదేశంలో రక్తహీనత వలన ప్రతి సంవత్సరం 24వేల మంది మరణిస్తున్నారు. అమెరికా–యూరప్ దేశాల్లో ఈ సంఖ్య వెయ్యిలోపే ఉంది. జీర్ణసంబంధమైన వ్యాధులతో సంవత్సరానికి 16లక్షల మంది చనిపోతుంటే, ఆఫ్రికా–దక్షిణాసియా దేశాల్లో ఈ సంఖ్య మరింత ప్రమాదకరంగా ఉంది. అమెరికా, యూరప్ దేశాల్లో ఈ సంఖ్య 100లోపే ఉంది. ఈ వ్యత్యాసానికి పోషకాహారం అందుబాటులో ఉన్న తేడానే కారణం.

ప్రస్తుతం భారతదేశంలో 24%మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే, కాంగోలో 70%, ఎరిత్రియాలో 66%, హైతీలో 50%, బంగ్లాదేశ్‌లో 26%, పాకిస్థాన్‌లో 23%, నేపాల్‌లో 17% మంది పోషకాహారంతో బాధపడుతున్నారు. పోషకాహార లోపం వలన స్త్రీలకు గర్భస్రావాలు కావటం, ఎదుగుదల లేని పిల్లలు, మృత శిశువులు జన్మించటం, జన్మించిన పిల్లలకు తల్లుల నుండి పాలు లభించకపోవటం జరుగుతున్నది.

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం పోషకాహారం అందక పేద దేశాల్లో మృతుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. 2006 సం॥లో 50% మంది పోషకాహారం అందక పోవటం వలనే చనిపోయారు. ప్రపంచంలోని ప్రతి 12 మందిలో ఒకరు ఆహారలోపం వలన బాధపడుతున్నారు. 2006లో ప్రపంచవ్యాపితంగా 3కోట్ల 60లక్షల మంది ఆకలితో మరణించారు.

## భారతదేశంలో పేదల దుస్థితి

2035 సంవత్సరానికల్లా చైనాను తలదన్నే ఆర్థికవ్యవస్థతో భారతదేశం ముందుకు పోతుందని, ప్రపంచదేశాలను తలదన్నే విధంగా అభివృద్ధి సాధిస్తుందని, అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలకు నమూనాగా ఉండబోతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.యం.ఎఫ్) ప్రపంచ బ్యాంక్‌లు చెబుతున్నాయి. ఈ అభివృద్ధి ప్రజల కోసం కాదని, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను పెంపొందించే అభివృద్ధి అని, అన్ని రంగాల్లో సామ్రాజ్యవాదులకు సేవకులుగా ఎలా ఉండాలో భారతదేశాన్ని, ఇతర దేశాలకు నమూనాగా పాలకులు మలుస్తున్నారని స్పష్టమౌతోంది. దీన్నే 'అభివృద్ధి' పేరిట భారత పాలకులు ప్రచారం చేసుకొంటూ ఎన్నికల్లో ఓట్లను రాబట్టుకునేందుకు ఉపయోగించుకొంటున్నారు. అధికార మార్పిడి జరిగిన 65 సం॥ల తర్వాత దేశంలో పెరుగుతున్న పేదరికాన్ని, వారి దయనీయమైన పరిస్థితిని పరిశీలిస్తే భారత అభివృద్ధి డొల్లతనం బయటపడుతుంది.

భారతదేశంలో ప్రభుత్వం చెబుతున్న దానికన్నా రెట్టింపు పేదలు ఉన్నారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపి) మానవాభివృద్ధి నివేదిక 2011 ప్రకారం 61 కోట్ల (53.7%) మంది పేదలు ఉన్నారు. దీని ప్రకారం అత్యధిక సంఖ్యలో పేదలు ఉన్న దేశం భారతదేశం. సగటున పురుషునికి, స్త్రీకి రోజుకి 2700 క్యాలరీల శక్తి అవసరం. అది పోషకాహారం ద్వారానే లభిస్తుంది. అలాంటి పోషకాహారం దొరకని లక్షలాదిమంది పేదలు భారతదేశంలో ఉన్నారు. వివాహాది శుభకార్యాల్లో జరిగే విందులో తినిపారేసిన విస్తరాకుల్లో మిగిలిన ఆహారాన్ని ఏరుకుని తిని బ్రతికే పేదలు, దాని ద్వారా 1749 క్యాలరీల శక్తిని మాత్రమే పొందగలుగుతున్నారు. కాయకష్టం చేసే ప్రతివ్యక్తికి ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలతో కూడిన ఆహారం అవసరం. అలాంటి ఆహారం లభించక కోట్లాదిమంది భారత ప్రజలు పోషకాహారలోపంతో అనేక రోగాల బారిన పడుతున్నారు.

భారత పాలకుల సామ్రాజ్యవాద అనుకూల, దోపిడీ అనుకూల విధానాల ఫలితంగా దేశంలో ఆహార ఉత్పత్తుల వృద్ధి రేటు తగ్గుతూ వస్తున్నది. 1970 దశకంలో ఇది 2.5% ఉంటే 80 దశకానికి 2.4% ఉండి, 1990లో 2.6% చేరినా, 2000 దశకంలో 1.9% పడిపోయింది. ప్రస్తుతం 1.5% వృద్ధే ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికార మార్పిడి జరిగిన తర్వాత వ్యవసాయరంగ అభివృద్ధి నామమాత్రంగానే ఉందని ఈ లెక్కలు తెలియచేస్తున్నాయి. పెరుగుతున్న జనాభా దృష్టిలో పెట్టుకొంటే ఆహార ఉత్పత్తుల వృద్ధి, అభివృద్ధే కాదు.

సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలు కాపాడుతున్న భారత దళారీ పాలకులు దేశ ప్రజల ఆహార అవసరాలను తీర్చే వ్యవసాయ విధానాలను అనుసరించటంలేదు. పెట్టుబడిదారీ దేశాల్లోని సంపన్నుల అవసరాలను తీర్చే పండ్లు, కూరగాయలు, ఇంధన అవసరం తీర్చేందుకు బయోడీజిల్ ఉత్పత్తి చేసే పంటల వైపు రైతులను మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారు. సెజ్‌లు, కారిడార్ పేరుతో లక్షలాది ఎకరాలను బడా పారిశ్రామికవేత్తలకు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడం ద్వారా ఆహార పంటల విస్తీర్ణం తగ్గి, ఉత్పత్తి గణనీయంగా పడిపోతున్నది. వ్యవసాయాన్ని దండగమారిగా మార్చి సేద్యం ఎడల విముఖత ఏర్పరచి, తమ భూములను కార్పొరేట్ సంస్థలకు అమ్ముకోవటమో, కాంట్రాక్ట్ సేద్యానికి అప్పగించటమో చేసే విధంగా చిన్న, సన్నకారు రైతులను నెడుతున్నారు. ఫలితంగా ఆహార ఉత్పత్తులు గణనీయంగా పడిపోయి, వాటిని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆహారధాన్యాల కొరతతోపాటు, వాటి ధరలు పెరుగుతూ ఉండటంతో పేదలకు అవి అందుబాటులో లేకుండా పోతున్నాయి. పాలకుల విధానాల ఫలితంగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లటంతో పేదలకు వచ్చే ఆదాయం, వారి ఆహార అవసరాలకు సరిపోవటంలేదు. 2006 నాటికి సరాసరి ప్రతివ్యక్తికీ 445.3గ్రా. ఆహార ధాన్యాలు అందుబాటులో ఉంటే, 2007లో 442గ్రా, 2008లో 436గ్రా, 2009లో 412గ్రా.కు తగ్గింది. 2006లో పప్పుదినుసులు సరాసరి 412.8గ్రాములు అందుబాటులో ఉంటే, 2008 నాటికి 394.2గ్రా, 2010కి 341.7గ్రాములకు పడిపోయింది.

ఆహార కొరత, పోషకాహార లోపం వలన స్త్రీలు, పిల్లలు వివిధ జబ్బులకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపంలో భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. మొదటిస్థానం బంగ్లాదేశ్ ఆక్రమించింది. ఐక్యరాజ్యసమితి బాలలనిధి (యునిసెఫ్) ప్రకారం ప్రపంచంలో పోషకాహార లోపంతో ఉన్నవారిలో 29% మంది భారతదేశంలోనే ఉన్నారు. దేశంలో 6 నుండి 35 నెలల వయసున్న పిల్లల్లో 78.9% రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ తీవ్రత గ్రామీణ ప్రాంతంలో 80%గా ఉందని జాతీయ కుటుంబ సర్వేలో వెల్లడైంది. 15 నుండి 49 సం॥లోపు వివాహిత మహిళల్లో 52.2% రక్తహీనతను ఎదుర్కొంటున్నారు. దేశంలో ప్రతిసంవత్సరం 20లక్షల మంది పిల్లలు ఐదేళ్ళ వయస్సు దాటకుండానే మరణిస్తున్నారు. రోజుకి అతిసారం వలన వెయ్యిమంది పిల్లలు మరణిస్తున్నారు. వైద్య సౌకర్యం అందుబాటులో వుంటే తగ్గే జబ్బులకు కూడా అలాంటి అవకాశంలేక పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రపంచంలోని అత్యధిక దేశాల్లో ఆహారం అందక ఆకలితో ప్రాణాలు కోల్పోతుంటే పెట్టుబడిదారీ దేశాల్లోని సంపన్నులు పోషకాహారం ఎక్కువై అవస్థలు పడుతుండటం పేదలకు–సంపన్నులకు మధ్య ఆహార వ్యత్యాసాన్ని తెలియచేస్తున్నది. 35కోట్ల జనాభా ఉన్న అమెరికాలో 40% మంది పురుషులు, 43% మంది స్త్రీలు పోషకాహారం ఎక్కువై భారీ శరీరంతో యిబ్బంది పడుతున్నారు. యూరప్ దేశాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. భారతదేశంలోనూ 10%మంది మితిమీరిన పోషక ఆహారం తిని భారీ శరీరాలతో బాధపడుతున్నారు. ఇంకా అనేక దేశాల్లో ఇదే పరిస్థితి ఉంది.

ప్రపంచవ్యాపితంగా అత్యధిక ప్రజలు పేదరికంలో మగ్గటానికి సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల దోపిడీకి గురికావటమే. దీని ఫలితంగా శ్రమజీవులైన పేదలకు వారు చేసే ఉత్పత్తులపైన, సృష్టించే సంపదలపైన హక్కు లేకుండా పోయింది. ఇవన్నీ కొద్దిమంది చేతుల్లో పోగుబడ్డాయి. వీరు పేదల జీవితాలను శాసిస్తున్నారు. పేదరికం తొలగాలంటే భూమిపైనా, పరిశ్రమలపైన, ఉత్పత్తి పరికరాలపైనా శ్రామికుల–కార్మికులకు హక్కు ఏర్పడాలి. ఇలాంటి హక్కును రష్యా–చైనా, వియత్నాం, క్యూబా మొదలగు దేశాల్లో కార్మికులు, రైతులు, శ్రామికులు ఐక్యమై సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య విధానాన్ని, దళారీబూర్జువా వర్గాన్ని కూలద్రోసి సాధించుకొన్నారు. ఆ దేశాల్లో కార్మిక–కర్షక రాజ్యాలు ఉన్నంతకాలం దోపిడీ శక్తులను అణచివేయటం జరిగింది. ప్రజలు ఆహార కొరతను చూడలేదు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పొందగలిగారు. అలాగే నేడు వివిధ దేశాల్లో ఉన్న పేదలు, ఆయా దేశాల్లో సామ్రాజ్యవాదాన్ని, భూస్వాములను, దళారీ పాలకులను కూలదోసి కార్మిక–కర్షక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవటం ద్వారానే ఆహారకొరతను అధిగమించి పోషకాహారాన్ని సరైన వైద్యాన్ని పొందగలుగుతారు. ✶

# రెంటచింతల కౌలు రైతుల కిడ్నీ అమ్మకాలకు ప్రభుత్వ, పాలకవర్గాల దోపిడీ విధానాలే కారణం

**గుంటూరుజిల్లా**-రెంటచింతల గ్రామం కిడ్నీ అమ్మకాలతో మరోసారి వార్తలకెక్కింది. దీనితో రెవిన్యూ, వైద్య, పోలీసు, మానవ హక్కుల కమీషన్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులందరు హడావుడి, విచారణల 'తంతు' కార్యక్రమాలను పూర్తిచేసి యధాలాపంగా చేతులు దులుపుకున్నారు. ఇప్పుడా హడావుడి సద్దుమణుగుతోంది. రైతుల పరిస్థితి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడనే' అన్న చందంగా మిగిలింది.

రెంటచింతలలో ఆంజనేయస్వామి మాన్యం కాలని - సన్న, చిన్నకారు, మధ్యతరగతితో పాటు, వ్యవసాయ కూలీలు, కౌలుదారులు అధికంగా నివసించే ప్రాంతం. సొంత భూముల్లేని పేదలు-భూస్వాముల, ధనిక రైతుల వద్ద భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. 1998 సం॥లో కిడ్నీలు అమ్ముకున్నవారు కూడా ఈ కాలనీకి చెందిన కౌలు రైతులే. పల్నాడు ప్రాంతంలో వెల్దుర్తి, దుర్గి మండలాల్లోను, మాచర్ల మండలం కంభంపాడు, దాచేపల్లి తదితర ప్రాంతాల్లో ఈ సం॥ము కౌలురైతుల ఆత్మహత్యలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా కూడా అనేకమంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కౌలురైతుల కిడ్నీల అమ్మకాలుగాని, ఆత్మహత్యలు గాని, విడిగా ఆ వ్యక్తులతో, లేక ఆయా కుటుంబాలకో చెందిన అప్పుల సంక్షోభంగా కన్పించవచ్చుగాని, వాస్తవంగా అది పీకల్లోతుల్లో వున్న వ్యవసాయరంగ సంక్షోభమే. అంతిమ పరిశీలనలో ప్రభుత్వ, పాలకుల దోపిడీ విధాన ఫలితంగా ఏర్పడిన సామాజిక సంక్షోభమే. ఈ సంక్షోభాల వ్యక్తీకరణలే ఈ కిడ్నీల అమ్మకాలు, ఆత్మహత్యలు.

1998 సం॥లో రెంటచింతల గ్రామంలో కౌలు రైతులు అప్పుల పాలై కిడ్నీలు విక్రయించుకున్నారన్న విషయం జాతీయ స్థాయిలో సంచలనం కల్గించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ కమిటీలు వేసి నివేదికలు తయారుచేసి "ఇకపై రైతులకు ఈ దుస్థితి రాకుండా అరికడతాం" అని వాగ్దానాల వర్షం కురిపించి చేతులు దులుపుకున్నారు. 2002లో హైదరాబాదులో జరిగిన "ఆసియన్ సోషల్ ఫోరం"(ఏ.ఎస్.ఎఫ్.) సదస్సుల్లో అంతర్జాతీయ స్థాయిలో కూడా కిడ్నీ అమ్మకాలపై చర్చ జరిగింది. అయినప్పటికీ రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు శూన్యం.

### పెరుగుతున్న పెట్టుబడులు, గిట్టుబాటుకాని ధరలు-రైతుల మెడలకు బిగుసుకుంటున్న అప్పుల ఉరితాళ్ళు

వ్యవసాయంలో ఏడాదికేడాది పురుగు, ఎరువు మందులు, విత్తనాలు, కౌళ్ళు, వడ్డీలు, ఇతర వ్యవసాయ అవసరాల ఖర్చులు పెరుగుతున్నాయేగాని, తగ్గడం లేదు. పెరిగిన ఖర్చులకు తగిన గిట్టుబాటు ధర లేక, పొందే నష్టం రైతాంగం మెడకు అప్పుల ఉరితాడుగా మారుతోంది.

అనాదిగా వ్యవసాయం చేస్తూ వస్తున్న రైతు, వేలకు వేలు అప్పులు చేయవలసిన దుస్థితికి నెట్టబడ్డాడు. పంటల నుండి మేలైన విత్తనాలను తనే స్వయంగా నిల్వ చేసుకొని, సేంద్రియ ఎరువులను వాడి పంటలు పండించిన రైతును, ప్రతిదానికీ కంపెనీలపై, మార్కెటుపై ఆధారపడే పరిస్థితి కల్పించారు. అధికదిగుబడులు, అధిక లాభాల ఎరను చూపించి "హరిత విప్లవం" పేరుతో జొచ్చుకొచ్చిన బహుళజాతి కంపెనీల నూతన వ్యవసాయ విధానం-భారత రైతాంగానికి కొత్తరకాల పురుగులు, తెగుళ్ళు, చీడపీడలు; అప్పులు, కిడ్నీ అమ్మకాలు, ఆత్మహత్యలను 'లాభం'గా మిగిల్చింది. కాగా, ఎంతో కొంత పెరిగిన అధిక దిగుబడుల లాభాలనీ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు; దళారీ, వ్యాపారమార్కెటు శక్తులు; వడ్డీలు, కౌళ్ళ రూపంలో భూస్వామ్య, ధనిక పెత్తందారీ వర్గాలు కొల్లగొట్టుకు పోతున్నాయి.

గత కొన్ని సం॥రాలుగా రైతులు తీవ్రమైన అననుకూల పరిస్థితుల మధ్య వ్యవసాయం చేస్తున్నారు. పగబట్టినట్లు ప్రకృతి వరుస విపత్తులను సృష్టిస్తోంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు అకాల వర్షాల కారణంగాను; సాగునీటి సరఫరాలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానాల కారణంగానూ పంటలు సాగు దయనీయస్థితిలో చిక్కుకుంది.

'ఏ చెరో గిరో పడి' పంట పండిస్తే ఆ పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఈ ప్రభుత్వాలు, పాలకులు రైతులను దళారీ మార్కెట్, వ్యాపార శక్తుల కబంధ హస్తాల్లోకి నెట్టివేస్తోన్నారు. పంట రైతుల చేతికి రాకముందు 'గుడ్డిలో మెల్లలా ఉన్న ధరలు, పంటలు చేతికొచ్చి తీరా అమ్ముకుందామనేసరికి అమాంతంగా పడిపోతుండటంతో రైతుల పరిస్థితి 'అమ్మబోతే అడివి కొనబోతే కొరివి' చందంగా తయారైంది.

### గాలిలో దీపంలా కౌలు రైతుల జీవితాలు

ప్రభుత్వ లెక్కల ప్రకారమే గుంటూరు జిల్లాలో 3.5 లక్షల మంది కౌలు రైతులున్నారు. లెక్కలకు రాని కౌలురైతులు దీనికి రెట్టింపు ఉన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్న ప్రభుత్వ కార్యక్రమం ఒక ప్రహసనంగా మారింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఒట్టి బూటకమని ఆచరణలో రుజువైంది. వ్యవసాయం లాభసాటికాదనుకున్న భూస్వామ్య, ధనిక రైతులు తమ భారాల్ని కౌలురైతులపై మోపుతున్నారు. అట్టడుగు కులాల వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున సెంటుకుంటో సాగుచేసే కౌలుదారులుగా ఉన్నారు. వెలుగులోకొచ్చిన కిడ్నీ అమ్మకాలు, నూటికి 90%కి పైగా ఈ కౌలు రైతులవే.

పంటలకు కావలసిన సాగునీరు, విత్తనాలు, ఎరువు, పురుగుమందుల సరఫరాను పాలకులు అస్తవ్యస్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. పంటలను నిల్వచేసుకొనే గిడ్డంగుల సదుపాయం లేదు. మార్కెట్ దళారి, దోపిడి శక్తులపై నియంత్రణ లేదు. ధరలపై అదుపులేదు. బ్యాంకుల నుండి సొసైటీల నుండి రుణ పరపతి లేదు. వ్యవసాయరంగ అభివృద్ధికై రైతులకు శాస్త్రీయమైన సూచనలు, సలహాలు అందించే యంత్రాంగం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు బలైతే ఆదుకునే దిక్కులేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దోపిడీ దౌర్జన్యాల నుండి రక్షణ లేదు. కౌలు రేట్లపై నియంత్రణ లేదు. కౌలురైతుల జీవితాలు గాలిలో దీపంలో వున్నా పట్టించుకునే నాధుడులేడు. ఇన్ని సుడిగుండాలకు ఎదురీదుతూ వ్యవసాయం చేయవలసిన పరిస్థితి రైతుకు ఏర్పడింది.

పంటలపై పెట్టిన ఖర్చులే తిరిగిరాక, నష్టాల పాలవుతుంటే, వ్యవసాయాన్నే నమ్ముకుని అదే జీవనాధారంగా బ్రతుకుతున్న రైతుల పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, రోగాలు, తిండి తిప్పలు, బట్టలు ఇలాంటి కుటుంబ, సాంఘిక, సాంస్కృతిక అవసరాల మాటేమిటి? వ్యవసాయం చేయటం వలన కౌలు రైతులకు మిగులుతున్నదేమిటి? అరుగాలం చాకిరీలు, అప్పులు, అవమానాలు, కిడ్నీ అమ్మకాలు, ఆత్మహత్యలు తప్ప!

అరాకొరాగైనా అందే బ్యాంకుల రుణాలు, పంట నష్టపరిహారాలు, భీమా సౌకర్యాలు, సబ్సిడీ ధరలపై ఎరువులు, వ్యవసాయ పరికరాలు, బ్యాంకు రుణాల రద్దు వంటి ప్రభుత్వ పథకాలన్నీ వ్యవసాయానికి దూరంగా వుంటూ అధిక కౌళ్ళను వసూలు చేసుకుంటున్న భూయజమానులకే చెందుతున్నాయి. కానీ, వ్యవసాయం చేస్తూ, సంపదను సృష్టిస్తూ, సామాజిక బాధ్యతను తమ భుజస్కంధాలపై మోస్తున్న కౌలురైతుకు ఎలాంటి రక్షణ, తోడ్పాటూ అందడంలేదు.

### ప్రభుత్వ పాలక వర్గాల విధానాలే వ్యవసాయరంగ సంక్షోభానికి మూలకారణం

ప్రభుత్వ, పాలక వర్గాలు-తమ దోపిడీ విధానాలతో వ్యవసాయం చేయడం 'దండగమారిన పని' అనే భావనను రైతులకు కలిగించి వారంతటవారే వ్యవసాయం నుండి తప్పుకునే విధంగా, క్రాప్ హాలిడేలు (పంట విరామాలు) ప్రకటించే విధంగా పరిస్థితులు కల్పించారు. సస్యరక్షణ, పైరురక్షణ పేరుతో కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వ వ్యవసాయశాఖ అండదండలతో విపరీతంగా ఎరువు, పురుగుమందుల వాడకం పెంచి కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అధిక లాభాలను ఆర్జించి పెడుతున్నాయి. కార్పొరేట్ కంపెనీల వ్యవసాయాన్ని రాష్ట్రంలో అమలు జరపడం కోసం ప్రపంచబ్యాంకు ప్రణాళికలో భాగంగా మొదటగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టి, కార్పొరేట్ వ్యవసాయంలోకి, పరాయీకరణవైపుకు రైతులను ఈడ్చటమే ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంగా ఉంది. "పాముకుండా పొగబెట్టిన చందంగా" ఉన్నాయి. కనుక కిడ్నీ అమ్మకాలతో ఆత్మహత్యలతో రైతాంగం సమస్యలకు పరిష్కారం కాదు.

రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామణ పేదలందరు తమ సమస్యల పరిష్కారానికై, వ్యవసాయరంగ రక్షణకై, పాలకుల ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలి. ★

# రెంటచింతల కౌలురైతుల కిడ్నీల అమ్మకంపై రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) బృందం పరిశీలన

**రెంటచింతల, 22-3-12 :**

గుంటూరు జిల్లా మండల కేంద్రమైన రెంటచింతల గ్రామం-ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో కిడ్నీలు అమ్ముకున్న బాధిత కౌలురైతులను 22-3-12న రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా ప్రతినిధి బృందం పరామర్శించింది.

ఈ ప్రతినిధి బృందంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ పాటిబండ్ల కోటేశ్వరరావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు; జిల్లా నాయకులు కా॥డి.భాస్కరరావు, కా॥ఎన్.రాంబాబు; ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్ స్వామి, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ఎమ్.నిర్మల, సీనియర్ కమ్యూనిస్టు సురభి అమరలింగం వున్నారు.

ఈ బృందం మొదట ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో నివాసముంటున్న బాధిత రైతులైన అప్పారావు, వెంకటరెడ్డి, బత్తిన కొండలులను పరామర్శించి, వారి నుండి వివరాలు సేకరించింది. ఇప్పటికి వెలుగులోకి వచ్చిన పేర్లు మాత్రమే వీరివికాగా, ఇంకా ఈ ప్రాంతంలో కిడ్నీలు అమ్ముకున్న బాధితరైతులు మరికొందరు కూడా వున్నట్లు; ఇప్పటికే కొంత మొత్తాన్ని బయానాగా పొంది, కిడ్నీలను అమ్మడానికి ఇంకొందరు సిద్ధంగా వున్నారని వెల్లడైంది.

బాధితులు చెప్పిన వివరాల ప్రకారం-పొలం కౌలుకు వ్యవసాయం చేయటం-రుణభారం పెరిగి పోవటం-ఈ వత్తిడిని తట్టుకోలేక పరువు నిలబెట్టుకోవటం కోసం ఈ పనికి సిద్ధమైనట్లు; బలవన్మరణాలకు పాల్పడి కుటుంబాలకు దూరమయ్యే కన్నా, ఒక కిడ్నీ అమ్ముకోవడమే దానికంటే ఉత్తమమని భావించి ఈ చర్యకు పాల్పడినట్లుగా పేర్కొన్నారు. కిడ్నీలు ఇస్తున్న విషయం అధికారుల అనుమతితోనే సాగగా, ఇప్పుడు ప్రభుత్వాధికారులు హడావుడి చేయటాన్ని బాధితులు ప్రశ్నించారు.

పీకల్లోతు కూరుకుపోయిన వ్యవసాయ రంగపు దుష్ఫలితాలే రైతుల బలవన్మరణాలు, కిడ్నీలు అమ్మకాలని ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. వ్యవసాయమే జీవనాధారంగా బతుకులీడుస్తున్న కౌలురైతులు వ్యవసాయ అవసరాల ఖర్చులు పెరగటం, భూముల కౌలు ధరలు పెరగటం, సంస్థాగత రుణాలందక వడ్డీ వ్యాపారులపై ఆధారపడటం-మధ్యలో ముంచుకొచ్చే విపత్తులను ఎదుర్కొని చేతికొచ్చిన పంటకైనా కనీసధర లేకపోవడం-వెరసి రుణభారంలో చిక్కుకుపోవటంతో పాటు వడ్డీవ్యాపారుల వత్తిడి, దౌర్జన్యాలు అధికమవటంతో ఈ విధమైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతున్నారు.

రెంటచింతల ప్రాంతంలో కిడ్నీలు అమ్ముకున్న రైతులను-రుణభారంలో కూరుకుపోయి అందుకు సిద్ధంగా వున్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, కౌలురైతులకు గుర్తింపుకార్డులిచ్చి సంస్థాగత రుణాలు నేరుగా వారికే అందించాలని, ప్రభుత్వం ఇచ్చే రాయితీలేవైనా కౌలుదారునికి నేరుగా అందించాలని; వ్యవసాయ అవసరాల ఖర్చులను విపరీతంగా పెంచుతున్న, మన వ్యవసాయ రంగంపై ఆధిపత్యం వహిస్తున్న సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల దోపిడీని అరికట్టాలని పరిశీలనా బృందం రెంటచింతల తహసిలుదారుకు అందజేసిన మెమోరాండం ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ★






# ఔషధ ప్రయోగాలకు బలిపశువులు

డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా అందజేసిన సమాచారం ప్రకారం 2005 జనవరి నుండి 2012 జూన్‌వరకూ జరిగిన ఔషధ ప్రయోగాలలో 80మంది మృత్యువాతపడ్డారు. కాగా వీరిలో 2008 నుండి 2010 వరకు చనిపోయిన వారిలో 50శాతం మందికే కంపెనీలు నష్టపరిహారం చెల్లించాయి. 2005 నుండి 2008 వరకూ 2012లో జూన్ వరకూ చనిపోయినవారికి ఇంకా నష్టపరిహారం చెల్లించలేదు.

మరణాలు ఔషధ ప్రయోగాలవల్లే జరిగాయని నిర్ధారించటానికి అవసరమైన సమాచారాన్ని కంపెనీలు అందించటంలో చూపుతున్న "అశ్రద్ధ"వల్ల నష్టపరిహారం చెల్లింపు ఆలస్యమౌతున్నదని డ్రగ్ కంట్రోల్ అధికారులు అంటున్నారు.

2010లో 667 మంది, 2011లో 438 మంది 2012 ఆగస్టులో 272 మంది ఔషధ ప్రయోగాల సమయంలో మృతిచెందారు. అంతకు ముందు సంవత్సరాల మృతుల వివరాలు పూర్తిగా డ్రగ్ కంట్రోలరుకు చేరలేదు. ప్రభుత్వం మార్గదర్శక సూత్రాలను రూపొందించింది 2011లో కనుక సమాచారమంతా తమకు చేరలేదని వారన్నారు. నష్టపరిహారం చెల్లింపులో కూడా లక్షన్నరనుండి 3 లక్షలు మాత్రమే చెల్లించారని తెలిపారు.(వివరాలు:బిజినెస్ స్టాండర్డు 5-3-2013).

సమాచారమందిన మూడేళ్లకూ 1377మంది ఔషధ ప్రయోగాల సమయంలో మృతిచెందారు. వీటిలో ఔషధ ప్రయోగంవల్లనే మృతిచెందినవారుగా 25 కేసులను నిర్ధారించారు. అంతకుముందు మరణాలను కలిపితే మృతులసంఖ్య ఐదువేలకు పైమాటే. వీరిలో మొత్తం 80మంది మాత్రమే ఔషధ ప్రయోగాలవల్ల మరణించారని నిర్ధారించారు. వీరిలో 40మంది నాలుగేళ్లలో మృతిచెందగా 20 మందికి మాత్రమే నష్టపరిహారం చెల్లించారు.

ఔషధ ప్రయోగాల పర్యవేక్షణకు నైతిక కమిటీలను నియమించాలి. కంపెనీలు తమ కనుకూలురతో ఈ కమిటీలను నింపివేసి మరణాలు సహజంగా జరిగినవిగా చూపుతున్నాయి. ఈ కమిటీల నియామకం జరగాలని చెప్పినా వాటి నియామకాన్ని కంపెనీలకే ప్రభుత్వం అప్పజెప్పి వాటిని డ్రగ్ కంట్రోలర్‌వద్ద రిజిస్టరు చేసుకొమ్మని చెప్పింది. ఆ కమిటీలిచ్చిన సమాచారం ఆధారంగా డ్రగ్ కంట్రోలరు కార్యాలయం లెక్కలు చెబుతున్నది తప్ప, ఇచ్చిన సమాచారంలో లోపాలను పరిశీలించటానికి తగిన యంత్రాంగం దానికి లేదు. అలాగే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించింది తప్ప, ఎంత మొత్తం చెల్లించాలో నిర్దేశించలేదు. ఔషధ ప్రయోగాలపై పెల్లుబికిన ప్రజానిరసనతో కంటితుడుపు చట్టాన్ని ప్రభుత్వం చేసింది. కంపెనీలు ఇష్టారాజ్యంగా ఔషధ ప్రయోగాలు సాగించి ప్రజల ప్రాణాలూ, ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి.

ఇవన్నీ మృతిచెందిన వారి వివరాలు మాత్రమే. ఔషధ ప్రయోగాలవల్ల వైకల్యం పొందినవారి వివరాలు లేవు. మృతిచెందిన వారికంటే ఐదునుండి పదిరెట్లు ఎక్కువగా వైకల్యంపొందిన వారి సంఖ్య వుందని రెండేళ్ళక్రితం పిడుగురాళ్ల ప్రాంత ప్రజలపై సాగించిన ఔషధ ప్రయోగాలు తెలిపాయి.

ఔషధ ప్రయోగాలు అనుమతించినందున ఆర్జించగల విదేశీ మారకద్రవ్యమే ముఖ్యమైన, భారత ప్రభుత్వం ప్రజల ప్రాణాలనూ, ఆరోగ్యాన్నీ సామ్రాజ్యవాద కంపెనీల లాభార్జనా పీఠంపై బలిపెడుతోంది. ★




# ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు జలాలను పొలాలకు, చెరువులకు వెంటనే అందించాలి!

**కరపత్రం**

**నల్గొండ జిల్లా** - రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతంగా ఉంటే దానిలో గుర్రంపోడు, పి.ఏ.పల్లి, దేవరకొండ, మునుగోడు, నల్గొండ ప్రాంతాలు మరింత దుర్భర పరిస్థితిలో ఉన్నాయి. భూములుండీ నీరు లేక గ్రామాలు ఉంటే, తాగేందుకు గుక్కెడు నీరు లేక ప్రజలు, పశువులు వలసలు పోవడం సాగుతూనే ఉంది. ఉన్ననీరు ఫ్లోరైడ్‌తో కలుషితం కావడంతో ఫ్లోరోసిస్ వ్యాధి ప్రజల సాధారణ జబ్బుగా మారిపోయింది. ఇలాంటి స్థితిలో, ఉన్న కాలుష్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం యురేనియం తవ్వకాలు చేపట్టి మొత్తం కృష్ణానది పరివాహక ప్రాంతాన్నే నాశనం చేయాలని చూస్తున్నది.

## నీటి కొరత - పాలకుల విధానం

రెండొందల సంవత్సరాలు ఇంగ్లీషు, నైజాం జమానాలలో తెలుగు ప్రాంత ప్రజలందరి అభివృద్ధి, సుఖ సంతోషాల ముచ్చటే లేదు. పాలకులు, వారి రెవెన్యూ కోసం చిన్న చిన్న ప్రాంతాలలో సాగునీటి పథకాలు అమలు చేయటం, మిగిలిన ప్రాంతాలను చౌక కూలీ సరఫరా కేంద్రాలుగా ఉంచే విధానాన్ని అమలుచేసారు. ఈ 60 సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ చరిత్ర కూడా ఇదే. ఫలితంగా ఇటు నల్గొండ, పాలమూరు, కరీంనగర్లు; అటు ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లా మెట్టప్రాంతాలు, రాయలసీమ జిల్లాలలో-సాగు భూమి ఉండీ నీరు లేక వలసలు పోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది. 1990 తర్వాత ప్రపంచీకరణలో భాగంగా నాటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్దేశించిన "ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ పథకం" పేర ప్రపంచ బ్యాంకు కొత్త జలవనరుల విధానాన్ని అమలు చేసింది. తర్వాత రాజశేఖరరెడ్డి కాలంలో అదే 'జలయజ్ఞం'గా అమలు అయింది. దాని ప్రకారం నీరు అన్నది ముందు 1. మహానగరాల అవసరాలు తీర్చాలి. 2. పారిశ్రామిక వాణిజ్య అవసరాలు తీర్చాలి. ఆ తర్వాతే అది పొలాలకు, గ్రామాలకు రావాలి. అప్పుడు కూడా ప్రతి నీటి చుక్కకి రేటు కట్టి వసూలు చేయాలి. ఎత్తిపోతల కింద భూములుంటే అక్కడ వరిపంట పండించవద్దు. ఆరు తడి పంటలు, వాణిజ్య పంటలు మాత్రమే ఆ భూములలో పండించాలి. దీని కోసం బిందుసేద్యం, తుంపర సేద్యాలను అమలు చేయాలి. వీటన్నింటినీ అమలు చేయటానికి నీటి వినియోగదారుల సంఘాలు, కమిటీలు ఏర్పడి రైతుల నుంచి, గ్రామాల నుంచి పైసలు వసూలు చేయాలి. ఇదీ పాలకుల నేటి జల విధానం.

మరో ప్రక్క తాగునీరు, సాగునీరు కోసం; ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకి గుక్కెడు మంచినీళ్ళ కోసం ఎన్నో సంవత్సరాలుగా నల్గొండ జిల్లా ప్రజలు, మేధావులు కొట్లాడితే చివరకు "శ్రీశైలం ఎడమ కాలువ పథకం" ముందుకు వచ్చింది. దీనినే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుగా పిలుస్తున్నారు. ఈ పథకాన్ని కూడా ప్రపంచ బ్యాంకు చెపుతున్న పథకంలో భాగంగానే ప్రభుత్వాలు అమలు చేసాయి. జి.వో.34ను ప్రభుత్వం విడుదల చేస్తూ ఎత్తిపోతల కింద ఆరు తడి పంటలు మాత్రమే పండేలా, కాలువలకి డిస్ట్రిబ్యూటరీలు, పిల్లకాలువలు లేకుండా సంపులు, పైపులైన్లతో బిందు సేద్యానికి పూనుకొన్నారు. 16, 17 డిస్ట్రిబ్యూటరీలు నుంచి నల్గొండ వరకూ పిల్లకాలువలు లేకుండా చేసారు. వీటి కోసం ప్రకటించిన పైలట్ ప్రాజెక్టు పాలకుల అవినీతి, పై నుంచి కింది వరకూ దొంగల బారినపడి విఫలమైంది. ఫలితంగా పి.ఏ.పల్లి, గుర్రంపోడు, కనగల్, నల్గొండ, కట్టగూర్ తదితర ప్రాంతాలకు నేటికీ ఏ.యం.ఆర్. ప్రాజెక్టు నీళ్ళు దక్కని స్థితి ఉంది. తల్లిపాలు దొరకని పిల్లల్లాగా పొలాలు, ప్రజలు అల్లాడుతున్నారు. ఫ్లోరైడ్‌తో బాధపడుతూ వలసలు పోతూనే ఉన్నారు. తమ ప్రాంతాల పశువులకి గడ్డికోసం, కూలిపనులకు పోతున్నారు. ఫలితంగా చెరువులు వట్టిపోతున్నాయి. గ్రామాలకి నీరు కావాలంటే కాలువలు తెగ్గొట్టాల్సిన పరిస్థితి, ప్రజల మధ్య కొట్లాటలకు కారణమవుతోంది. గ్రామాలకి మంచి నీరందించే చేపూరు మంచినీటి ప్రాజెక్టు అమలు కావడంలేదు, పై భాగాన ఉన్న వట్టికోట, వెలమోనిగూడెం, పర్లాపల్లి, గుండ్లకంట, పోచంపల్లి, తేనెపల్లి తదితర ప్రాంతాల ప్రజలు నీళ్ళు కొనుక్కుంటేనే కనీస అవసరాలు తీరే పరిస్థితి ఏర్పడింది. మంచినీరు ఒక భారీ వ్యాపారం అయింది. ప్రతీ కుటుంబం నెలకి కనీసం 300 రూపాయలు తాగునీటికై ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

మరో ప్రక్క పుట్టంగండి సిస్టర్న్‌ను పాలకులు పథకం ప్రకారమే నిర్వీర్యం చేశారు. అవినీతి దానిలో ఒక భాగం మాత్రమే. పుట్టంగండి సిస్టర్న్‌ను ఆచరణలో మరో సింగూరుగా, జంటనగరాలకి నీరందించే ప్రాజెక్టుగా కుదించదలుచుకున్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా జంట నగరాలకి నీరు ఆగడం లేదు. నిజాం సాగర్ పూడిపోతుంది. కనుక బాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మెదక్, నిజామాబాద్ జిల్లాల పొలాలకు నీరందించాల్సిన సింగూరును ప్రభుత్వం ఎపుడో తెచ్చిన జి.వొ.91 పేర జంటనగరాలకే నీరందించుతోంది. నీరు కావాలంటున్న మెదక్, నిజామాబాద్ రైతులు కాలవలోకి బుంగలు పెడుతున్నారని కేసులు పెడుతోంది. పుట్టంగండి కూడా ఆచరణలో ప్రపంచ బ్యాంకు, సామ్రాజ్యవాదుల, పాలకుల పథకంలో భాగంగానే మార్చబోతున్నది. దీన్ని ప్రతిఘటించాలి.

1. గుర్రంపోడు మండలంలోని 16, 17 డిస్ట్రిబ్యూటరీల నుంచి ప్రారంభించిన ప్రాజెక్టును రద్దుచేయాలి.
2. జి.వొ. 34 రద్దు చేయాలి.
3. తెరాటిగూడెం, గనిపల్లి, భీమనపల్లి, పల్లిపాడు, వెలమగూడెం, తదితర గుర్రంపోడు, పి.ఏ.పల్లి మండలాల్లో ఏ.యం.ఆర్. ప్రాజెక్టు భూములకు మేజర్ కాల్వలకు పిల్ల కాలువలను వెంటనే తవ్వించాలి.
4. జిన్నాయ చింత, బ్రాహ్మణగూడెం, చేపూరు, మోసంగి తదితర 19వ డిస్ట్రిబ్యూటరీ గ్రామాల నుంచి చామలేరు, పెట్లలగూడెం, అమలూరు, చేపూరు, బొల్లారం, నడికూడ, కొత్తలాపురం మీదుగా 25వ డిస్ట్రిబ్యూటరీ వరకూ పొలాలకు పంట కాలువలు, పిల్లకాలువలు తవ్వించాలి.
5. చేపూరు మంచినీటి ప్రాజెక్టుకు వెంటనే పైపులైను పూర్తిచేసి, అన్ని ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు మంచినీరు అందించాలి.
6. మోసంగి పెద్దచెరువు, చేపూరు పెద్ద చెరువు, కొప్పోల, బొల్లారం, నడికూడ తదితర గ్రామాల చెరువులన్నింటికీ, ఏ.యం.ఆర్. ప్రాజెక్టు పరిధిలోని అన్ని చెరువులకి ప్రత్యేక కాలువలు తవ్వించి ప్రాజెక్టు నీరు సరఫరా చేయాలి.
   ఏ.యం.ఆర్ ప్రాజెక్టుపై నిర్మితమవుతున్న హైలెవల్ కాలువ జూనూతల వరకే ఆపకుండా తేనెపల్లి హనుమాన్ చెరువు నుండి పోచంపల్లి చెరువు వరకూ పొడిగించాలి.
7. పుట్టంగండి సిస్టర్న్‌లోని అవినీతికి, నాసిరకం నిర్మాణాలకు బాధ్యులను కఠినంగా శిక్షించాలి. పుట్టంగండి మరో సింగూరుగా మారకుండా ప్రధానంగా నల్గొండ జిల్లా వ్యవసాయధార, ఫ్లోరైడ్ బాధిత ప్రజల అవసరాలు తీర్చడమే మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వం ప్రకటించాలి.
8. గత సంవత్సరం నుంచి ఏ.యం.ఆర్. ప్రాజెక్టు క్రింద గాని, పై భాగానికి గాని ప్రభుత్వం సాగునీరు అందించలేదు. కనుక అన్ని పంటలు, ముఖ్యంగా బత్తాయి తోటలు నష్టపోయిన రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలి.
9. జిల్లాలో యురేనియం త్రవ్వకాలను నిషేధించాలి.

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)**
**గుర్రంపోడు ఏరియా, నల్గొండజిల్లా** ✱

**మారుతీసుజికి..** (చివరి పేజీ నుండి)

విజయనగరంలో సంఘీభావసభకు హాజరైన కార్మికులు



ఈ సంఘీభావ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥గణేష్ పండా మాట్లాడుతూ మారుతీ సుజికీలో కాని, హీరోహోండాలో కానీ, రీజెన్సీలో కాని కార్మికులు చట్టప్రకారం తమకు సంక్రమించిన హక్కుల అమలు గురించి, సౌకర్యాల కల్పన గురించి మాత్రమే డిమాండ్ చేశారు మినహా, వారేదో గొంతెమ్మ కోర్కెలు కోరలేదన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి తదనుగుణంగా పాలన సాగిస్తామన్న ప్రజా ప్రతినిధులతో కూడిన ఈ ప్రభుత్వాలన్నీ కార్మికుల చట్టబద్ధమైన హక్కులను సైతం కాలరాచివేసి బహుళజాతి, బడాపెట్టుబడిదారీ వర్గాల కొమ్ముగాస్తూ వస్తున్నాయన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥దంతులూరి వర్మ మాట్లాడుతూ మారుతీ సుజికీ కార్మికులకు మద్దతు తెలుపుతూ పాలకుల కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు.

ఇంకా ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥బి.శంకరరావు మరియు రెడ్డి నారాయణరావులు ప్రసంగించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) జాతీయ కమిటీ పిలుపు మేరకు మారుతీ సుజికీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, జైల్లో ఉన్నవారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక సంఘాలు హర్యానా ముఖ్యమంత్రికి ఫ్యాక్సులు పంపాలని సభ తీర్మానించింది. ఈ సభకు వివిధ కార్మిక సంఘాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

**విజయవాడ, 7-2-2013 :**

మారుతి సుజుకి కార్మికులు దీర్ఘకాలంగా సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఏఐఎఫ్‌టియు (న్యూ) ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సంఘీభావసభ జరిగింది. సంస్థ రాష్ట్రనాయకులు కా॥టి.పూర్ణచంద్రరావు సభకు అధ్యక్షత వహించి, పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల నేపథ్యంలో సుజుకీ కార్మికులు సాగిస్తున్న పోరాటానికి ఎంతో ప్రాధాన్యత వుందనీ, కావున అన్నిరంగాల కార్మికులు వారి పోరాటానికి సంఘీభావం తెలపాల్సిన అవసరం వుందన్నారు.

తొలుత ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రనాయకులు కా॥జి.వి.భద్రం మాట్లాడుతూ, మన దేశంలో కార్లను ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలోని పలుదేశాల్లో కార్లను విక్రయిస్తూ జపాన్ దేశానికి చెందిన సుజుకీ కార్పొరేషన్ యాజమాన్యం కార్మికులకు కనీస హక్కులు లేకుండా దారుణంగా దోపిడీ చేస్తుందన్నారు. భారతదేశ కార్మికవర్గం ఎన్నో త్యాగాలు చేసి, పోరాటాల ద్వారా సాధించుకొన్న చట్టపరమైన హక్కులను కూడా గుర్తించ నిరాకరిస్తూ, కార్మికుల పోరాట చైతన్యాన్ని, సంఘటితతత్వాన్ని సహించని సుజుకీ యాజమాన్యం దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నదనీ, అందులో భాగంగానే 149 మంది కార్మికులపై అక్రమ కేసులుపెట్టి జైలుపాలు చేసిందనీ, 1800 మంది కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ పెద్దఎత్తున లాభాలు గడిస్తున్నదనీ, కేంద్ర పాలకులు అనుసరిస్తున్న నయాఉదారవాద విధానాల ఫలితంగానే కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడిందనీ, గతంలో కార్మికవర్గం సాగించిన పోరాటాల అనుభవాల వెలుగులో సుజుకీ కార్మికులు పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళాలనీ, అందుకు మన రాష్ట్రంలోని కార్మికవర్గం ఆచరణాత్మక మద్దతు అందించాలని పిలుపునిచ్చారు.

ఓపిడిఆర్ రాష్ట్రనాయకులు యం.వి.కృష్ణయ్య మాట్లాడుతూ, జపాన్‌కి చెందిన సుజుకీ కంపెనీ మారుతిసుజుకీ కార్పొరేషన్ పేరుతో ఏవిధంగా మనదేశంలోకి ప్రవేశించిందో వివరించారు. అలానే హుండాయి, స్కోడా, టయోటా, మహీంద్రా మొదలుకొని మనదేశంలో అన్ని విదేశీకార్లతో నింపేశారనీ, ప్రపంచీకరణలో భాగంగా మనదేశంలో నూతన ఆర్థికవిధానాల అమలులో భాగంగా విదేశీ కంపెనీలకు గేట్లు బార్లా తెరిచారనీ, అప్పటినుండి మరింతగా కార్మికుల హక్కులను కాలరాయటం ప్రారంభించారనీ, కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను → → రద్దుచేయాలని సుజుకీ కార్మికులు సాగిస్తున్న పోరాటం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

సంఘం రాష్ట్రకార్యదర్శి వై.సోని మాట్లాడుతూ, మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలకు పెద్దపీట వేసే దానిలో భాగంగా దివాళా తీసిన బడాపరిశ్రమలకు ఉద్దీపన పథకాల ద్వారా సహాయం చేస్తూ మరోవైపు దినదిన గండంగా జీవితాలు గడుపుతున్న కాంట్రాక్టు కార్మికుల హక్కులను కాలరాచే చర్యలకు పాల్పడుతున్నదనీ, మేడే పోరాటం సాక్షిగా సంపాదించుకొన్న పనిగంటల హక్కును ప్రైవేటీకరణ విధానాల పేరుతో లాగేసుకొని మరింతగా పనిభారాన్ని పెంచే చర్యలకు పాలకులు పాల్పడుతున్నారనీ, కావున సాధించుకొన్న హక్కులను కాపాడుకునే పోరాటాలను మరింత సంఘటితంగా సాగించాలని పిలుపునిచ్చారు.

ఓపిడిఆర్ రాష్ట్రఅధ్యక్షులు కె.ఏసు మాట్లాడుతూ, కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కుకోసం, ఉద్యోగభద్రత కోసం సాగిస్తున్న పోరాటాలపై పాలకులు అమలు జరుపుతున్న అణచివేత చర్యలను ఖండించాలనీ, సుజుకీ కార్మికులు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి తమ సంఘం పూర్తిమద్దతును తెలియచేస్తున్నదని ప్రకటించారు. ✱

**తమ సాగు...** (చివరి పేజీ నుండి)

7-2-2013న కలెక్టరు వచ్చేదాకా అక్కడ నుంచి కదలబోమని ధృడంగా గిరిజనులు ప్రకటించారు. ఉదయం 8 గంటలకు కార్యాలయానికి వచ్చిన తహశీల్దారు గిరిజనుల పట్టుదల చూసి 10 గంటలకు కార్యాలయం వెనుక నుంచి జారుకున్నాడు.

సాయంత్రం 4 గంటలకు తహశీల్దారు వెంట వచ్చిన ఆర్‌డిఓ 'సాగువ్రాస్తామని చెపుతున్నారు కదా, దీక్షవిరమించి వెళ్ళిపొమ్మ'ని కోరారు. కానీ, గిరిజనులు ప్రజల సమక్షంలో విఆర్‌ఓకు వ్రాత పూర్వకంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడు ఆర్‌డిఓ, విఆర్‌ఓలను పిలిచి నెలాఖరులోపు సాగు నమోదు పూర్తి చేయమని, రెవిన్యూ సదస్సుల్లో రికార్డులు ఇవ్వాలని చెప్పారు. ఆ మేరకు పోలవరం తహశీల్దార్ వ్రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారు. ప్రజల హర్షధ్వానాల మధ్య గిరిజనులు తమ రెండురోజుల నిరవధిక ధర్నాను విరమించారు.

త్రాగటానికి నీరు, మరుగుదొడ్లు లాంటి కనీస సౌకర్యాలు లేనిచోట వెయ్యిమందికి పైగా ప్రజలు ముఖ్యంగా మహిళలు పట్టుదలతో చేసిన ఆందోళనతో అధికార్లు దిగివచ్చారు. అప్పటి వరకు భూస్వాముల అడుగులకు మడుగులు వత్తుతున్న విఆర్‌ఓలు ప్రజల దగ్గరికి తక్షణమే వచ్చి రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు.

రెండు రోజులపాటు నిరవధికంగా జరిగిన ఈ ధర్నాకు ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీ సంఘం ఆం.ప్ర. అనుబంధం) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు, జిల్లానాయకులు కామ్రేడ్స్ పద్దం కృష్ణమూర్తి, సవలం రాంబాబు, కులుం గంగాదేవి, నవయువ సమాఖ్య నాయకులు కా॥మిడియం రవి తదితరులు నాయకత్వం వహించారు. ✱

# రైల్వేఛార్జీల పెంపుదలకు వ్యతిరేకత

**19-1-13 బందరు :**

రైల్వేఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఏఐఎఫ్‌టియు (న్యూ) ఆధ్వర్యంలో బందరు రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి, డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని రైల్వేస్టేషన్ మాస్టరుకు అందజేసి కేంద్రప్రభుత్వానికి పంపవలసినదిగా కోరారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శి కా॥వై.సోని మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు ఆదేశం మేరకు రైల్వేశాఖను దశలవారీగా ప్రైవేటీకరించే క్రమంలో భాగంగా రైల్వేటారిఫ్ అథారిటీని ఏర్పాటుచేయటాన్ని ఖండించారు. దీనితో ప్రభుత్వ నియంత్రణకు నీళ్ళొదిలినట్లేనని, విద్యుత్తు ఛార్జీలలాగే రైల్వేఛార్జీలు కూడా పెరుగుతూ పోతాయని చెబుతూ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించటం మినహా మరో మార్గం లేదన్నారు.

ఏఐఎఫ్‌టియు (న్యూ) పట్టణ నాయకులు కా॥ముచ్చు సుధాకరరావు, జి.మల్లేష్, రైతుకూలీసంఘం నాయకులు కా॥పి.అంజమ్మ, రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ✱

# తమసాగు భూములను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని పోలవరం ప్రాంత గిరిజనుల దీర్ఘకాల ఆందోళన

**పశ్చిమగోదావరి జిల్లా,** పోలవరం ప్రాంత గిరిజనులు-భూముల కోసం, భూములపై హక్కుల కోసం ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీ సంఘం-ఆం.ప్ర. అనుబంధం) నాయకత్వంలో 1992 నుండి పోరాడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో పోలీసుల లాఠీచార్జీలు, అరెస్టులు, భూస్వాముల దాడులు, కాల్పులు, జైళ్ళులాంటి ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. పదుల సంఖ్యలో కేసుల్లో వందల మంది కోర్టుల చుట్టూ తిరిగారు. కొన్ని కేసులు కొట్టి వేయబడినప్పటికీ, ఇంకా అనేక కేసుల్లో కోర్టులకు తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటికీ మాజీ జమిందార్లు, భూస్వాముల ఏజంట్లు, స్థానిక గిరిజన పెత్తందార్లు -గిరిజనుల మధ్య చీలికలు తెచ్చి, భూములను గిరిజనులకు దక్కకుండా చేసే కుట్రలను ఎదుర్కొంటూ నిలబడి పోరాడుతున్నారు. పోరాడి సాధించుకున్న భూములలో నిలబడి స్థిరమైన వ్యవసాయం చేసుకుంటూ తమ సాగులో ఉన్న భూములపై హక్కుకోసం అనేక ఆందోళనలు చేస్తున్నారు. 1997 నవంబరు 4న మాజీ జమిందారు కాల్పులలో కామ్రేడ్ కారం పార్వతి అమరత్వం తర్వాత కూడా వివిధ పర్యాయాలు ధర్నాలు, రాస్తారోకోలు ఊరేగింపులు జరిపి సంబంధిత అధికార్లకు విన్నవించారు. గ్రామసభలు, రచ్చబండ, రెవిన్యూ సదస్సులలో విజ్ఞాపనలు, ఫిర్యాదులు ఇస్తూనే ఉన్నారు. 2002 జూన్‌లో వందలాదిమంది ధర్నా నిర్వహించి ఆనాటి కలెక్టర్ పూనం మాలకొండయ్యకు విజ్ఞప్తి చేశారు. 2005లో పోలవరం ప్రాజెక్టు (ఇందిరాసాగర్) విషయమై గ్రామగ్రామాన గ్రామసభలు జరిపి గవర్నర్‌దాకా తీర్మానాలు పంపారు. 2008 జూలై 28న కోట రామచంద్రాపురం ఐ.టి.డి.సి. వద్ద 1500 మంది ధర్నా చేసి, డాక్టరు బి.డి.శర్మ, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో పీ.ఓ., ఆర్డీఓలతో చర్చించారు. గిరిజనుల సాగును నమోదు చేస్తామని, ఎంజాయ్‌మెంట్ పట్టాలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చాక మరలా, 2008 నవంబర్ 30న ఏలూరులో 1200 మంది ధర్నా


పోలవరం తహసీల్‌దారు కార్యాలయం వద్ద నిరవధిక ధర్నా చేస్తున్న గిరిజనులు

చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా ధర్నానుద్దేశించి జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ గిరిజనుల సాగును నమోదు చేసేందుకు క్రింది వరకూ ఆదేశాలిస్తామని, గిరిజనుల న్యాయమైన సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

గిరిజనుల సాగులోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు, గిరిజనుల సాగు నమోదును త్వరితగతిన పూర్తి చెయ్యాలని గ్రామ రెవిన్యూ అధికారులకు పోలవరం తహశిల్దారు 2010 ఏప్రిల్ 6న వ్రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత 2012 డిసెంబర్ 5న డ్వాక్రా సమావేశానికి హాజరైన కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఆర్డీఓలు గిరిజనుల డిమాండ్‌లన్నీ నెరవేరుస్తామన్నారు. జాయింట్ కలెక్టర్- పోలవరం తహశిల్దార్, ఆర్డీఓ, వీఆర్ఓలకు ఆదేశాలు ఇచ్చారు. వెంటనే కొన్ని గ్రామాల్లో సాగు నమోదు ప్రారంభించిన వీఆర్వోలు మరల ఆ పనిని నిలిపివేశారు. గిరిజనేతర భూస్వాములతో కుమ్మక్కుఅయి, నకిలీపాస్ పుస్తకాలు సృష్టించి వేల ఎకరాలు భూకుంభకోణాలకు తోడ్పడుతున్న ఏజన్సీ రెవిన్యూ అధికారులు, చట్ట ప్రకారం అధికారుల ఆదేశాలను కూడా అమలు పరచకుండా ప్రక్కనపెట్టారు.

మరో ప్రక్క పోలవరం ప్రాజెక్టు, నేషనల్ పార్కుల పేరుతో భూస్వాములకు, మాజీ జమిందారులకు లబ్ధిచేకూర్చేందుకు (భూములకు నష్టపరిహారం పేరుతో) రెవిన్యూ యంత్రాంగం గిరిజనుల హక్కులను కాలరాచివేస్తున్నది. చేగొండపల్లి, సింగనపల్లిలలో గిరిజనులు గత సంవత్సరం తమ భూములను పునస్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్నప్పటికీ, పైడిపాక భూస్వాములను సాగుదార్లుగా నమోదుచేసి దొంగరికార్డులు సృష్టించి ప్రాజెక్టుపేరుతో నష్టపరిహారం కట్టబెట్టి అమలుచేయ జూస్తున్నారు. విచారణ పేరుతో 'భూములకు సంబంధించి మీకున్న అధికారాలను తీసుకొని 16-4-2012న ఆర్‌డిఓ కోర్టుకు హాజరు కమ్మని' సాగులో ఉన్న గిరిజనులకు నోటీసులు పంపిన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓ 9-4-12నే భూస్వాములకు అనుకూలంగా తీర్పులిచ్చాడు. నోటీసులతో గిరిజనులు ఆర్‌డిఓ కోర్టుకు హాజరుకాగా, 'మీ కేసు కొట్టివేశామ'ని అధికారులు చెప్పారు. రెవెన్యూ అధికార్ల మోసాలు గ్రహించిన గిరిజనులు, పోలవరంలో నిరసన ప్రదర్శన జరిపారు. 2012 జూలైలో పునరావాస అధికారి ముందు ధర్నా చేసి, భూస్వాముల, రెవిన్యూ అధికారుల కుట్రలు బట్టబయలు చేశారు.

గిరిజనుల సాగులో ఉన్న భూములను నమోదు చేయకుండా, ప్రాజెక్టు పేరుతో భూస్వాములకు నష్టపరిహారం అందిస్తూ పునరావాసం పేరుతో ముంపు ప్రాంత గిరిజనులకు, దిగువన సాగులో ఉన్న గిరిజనులకు మధ్య తగవులు పెడుతున్న రెవిన్యూ అధికారుల కుట్రలను ప్రజలకు వివరించి, సాగునమోదు కోసం పెద్దఎత్తున ఉద్యమించాలని సంఘం జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది.

## పోలవరం తహసిలుదారు కార్యాలయం వద్ద నిరవధిక ధర్నా

ఈ పిలుపులో భాగంగా **6-2-2013న** పోలవరం తహసిలుదారు కార్యాలయం వద్ద 1000 మందికి పైగా గిరిజనులు నిరవధిక ధర్నా ప్రారంభించారు. గిరిజనుల ఆగ్రహం చూసిన సిబ్బంది, కార్యాలయం తలుపులు మూసి బయటకు వచ్చారు. గిరిజనులు కార్యాలయం చుట్టూ కూర్చుని దిగ్బంధనం చేశారు. నాయకుల ఉపన్యాసాలు, ఉద్యమ పాటలు, ప్రజాకళాకారుల నృత్యాలతో కార్యాలయ ప్రాంతం సాయంత్రం వరకు మారుమ్రోగింది. 5గంటలకు తహశిల్‌దారు వచ్చాడు. గట్టిగా కేకలు వేస్తే వెళ్ళిపోతారనుకున్న తహశిల్‌దారు, గిరిజనుల నిబ్బరం చూసి అలాగే కూర్చొండిపోయాడు. మధ్యలో అనేకసార్లు పోలీసులు వచ్చి గిరిజనులను బెదిరించే ప్రయత్నాలు చేశారు. తహశిల్‌దారు, ఆర్‌డిఓ తదితర అధికార్లతో మాట్లాడి మరోసారి 'సాగు నమోదు చేస్తాము' అని హామీ ఇవ్వగా, గిరిజనులు వ్రాతపూర్వకమైన హామీ కావాలన్నారు. రాత్రి 8 గంటల వరకు అక్కడే వున్న తహశిల్‌దారు "నేను షుగర్ పేషంటుని, నేను వెళ్ళి ఆర్‌డిఓతో మాట్లాడుకొని వస్తాను" అని పలాయనం చిత్తగించాడు. దీంతో పైఅధికారులు వచ్చి ప్రకటన చేసేవరకు కదలబోమని మరింత పట్టుదలతో గిరిజనులు వంటలు మొదలుపెట్టారు. తీవ్రమైన చలి, దోమలను కూడా లెక్కచేయకుండా రాత్రి అంతా అక్కడే పడుకున్నారు.

(తరువాయి 7వ పేజీలో)

## ఏఎంఆర్‌పి ద్వారా సాగునీరు, తాగునీటికై ఆందోళన


నల్గొండజిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

**నల్గొండ, 11-2-13 :**

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా గుర్రంపోడు ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని డిమాండు చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 11-2-13న నల్గొండ జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెనెపల్లి, తెరాటిగూడెం, చేపూరు, బొల్లారం, బొడపాడు, మోసంగి గ్రామాల నుండి రైతులు పాల్గొన్నారు.

ఈ ధర్నాలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ఎం.డి.యాకూబ్ మాట్లాడుతూ ఏఎమ్మార్ ప్రాజెక్టు పరిధిలో రైతుల భూములకు పిల్లకాల్వలు తవ్వించాలని, చెరువులు నింపాలని, ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ కా॥బాణాల వెంకటరెడ్డి మాట్లాడుతూ గుర్రంపోడు మండలంలోని 16,17 డిస్ట్రిబ్యూటరీల నుండి ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టును, జీవో నెం 34ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ఎలకా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఫ్లోరైడ్ పీడితులుగానున్న ప్రజానీకం జిల్లాలో యురేనియం తవ్వకాలతో మరింత ముప్పును ఎదుర్కోవలసి వస్తుందని, యురేనియం తవ్వకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆందోళనకు మద్దతుగా నల్గొండ న్యాయవాది శ్రీ గుర్రం వెంకటరెడ్డి ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.

ఇంకా, ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ బండారు యాలాద్రి, జయరాజు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన మెమోరాండంను జిల్లాకలెక్టరుకు అందజేశారు. ధర్నాకు ముందుగా వారంరోజులు గుర్రంపోడు మండల పరిధిలోని గ్రామాలలో సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలతో విస్తృత ప్రచారం చేశారు. ✡

## మారుతీ సుజికీ కార్మికుల పోరాటానికి సంఘీభావం



విజయవాడ సభలో ప్రసంగిస్తున్న కా॥వై.సోని


విజయనగరం సభలో ప్రసంగిస్తున్న కా॥గణేష్‌పండా

**విజయనగరం, 5-2-13 :**

హర్యానాలోని గురుగావ్ జిల్లాలోని మారుతీ సుజికీ - మానేసర్ ప్లాంట్‌లో యాజమాన్యం 2012 జూలై 18వ తేదీ నుండి లాకౌట్ ప్రకటించి, తదుపరి 1800 కాంట్రాక్ట్ కార్మికులను, 546 మంది పర్మినెంట్ కార్మికులను అక్రమంగా పని నుండి తొలగించింది. ప్రస్తుతం కొత్త కాంట్రాక్ట్ కార్మికులను తీసుకొని పరిశ్రమ నడిపిస్తున్నది.

కార్మికులపై అక్రమంగా నేరాలను మోపి తప్పుడు కేసులు బనాయించి 149 మంది కార్మికులను, నాయకులను జైలుకు పంపింది. 7 నెలలు కావస్తున్నా ఈ 149 మందికి బెయిలు లభించక జైలుగోడల మధ్య మ్రగ్గుతున్నారు. రెండువేలకు పైగా కార్మిక కుటుంబాలను ఆకలి మంటలకు గురిచేసిన ఈ విదేశీ కంపెనీకి హర్యానా రాష్ట్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వాలు అన్ని విధాలుగా కొమ్ముకాస్తున్నాయి. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పోలీసు బలగాలను దింపి కార్మికులను భయకంపితులను చేస్తున్నాయి.

అయినప్పటికీ తమపై జరుగుతున్న అణచివేత చర్యలను వ్యతిరేకిస్తూ మారుతీ సుజికీ కార్మికులు పోరాడుతున్నారు. మారుతీ సుజికీ కార్మికుల విజ్ఞప్తిపై 2013 ఫిబ్రవరి 5వ తేదీన దేశమంతటా గల కార్మికవర్గం మారుతీసుజికీ కార్మికులకు తన సంఘీభావం ప్రకటించింది. ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో విజయనగరం-అంబటి సత్రం జంక్షన్‌లో గల ప్రెస్‌క్లబ్‌లో మారుతీ సుజికీ కార్మికులకు సంఘీభావంగా సభ జరిగింది. ఈ సభకు బి.శంకరరావు (ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు) అధ్యక్షత వహించారు.

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010